
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
గుంటూరు జిల్లా వార్తలు
5
మంగళవారం 25 ఫిబ్రవరి 2025



## సీఎం చొరవ.. మిర్చి ధరల్లో కదలిక

- క్వింటాకు రూ. 1000కి పైగా పెరిగిన వైనం
- ఈ సీజన్‌లో తొలిసారిగా రూ. 14500 పలికిన 341 వెరైటీ
- తేజ రకం కూడా రూ. 14,200కు చేరిక
- భవిష్యత్తులో మరింత పెరిగే సూచనలు
- హర్షం వ్యక్తం చేస్తున్న రైతాంగం

8

# గులియన్ గుబులు




- కలుషిత నీరు, ఆహారంతోనే జీబీఎస్ వ్యాప్తి
- పట్టణాల్లో ప్రమాద ఘంటికలు
- పట్టించుకోకుంటే పరిస్థితి విషమం


వినుకొండ : కొత్తపేట బలరాం హాస్పటల్ సమీపంలో మురుగు కాలవలో మంచినీటి పైపులు


బాపట్ల : జీబీసీరోడ్డులో ఎస్ఎన్‌పీ అగ్రహారం దగ్గర డ్రైనేజిలో ఏర్పాటు చేసిన తాగునీటి పైపులైన్

8

# ఉసురు తీసిన వరల బావి


మృతులు మహంకాళి (29), రాజేష్(20), కాళీ బాబు(52), బాలయ్య(45)

6

బతుకుదెరువు కోసం నంబూరు కాళీ బాబా ఆశ్రమ సమీపంలోని గోశాలలో కూలి పనులకు చేరారు. వరల బావిని శుభ్రం చేసేందుకు సోమవారం అందులోకి ఇనుపనిచ్చిన వేసుకుని దిగారు. కంప్రెషర్‌కు ఉన్న వైర్లు తెగి విద్యుత్ సరఫరా జరిగి తొలుత గండాల మహంకాళి (29), అనంతరం యాకుల రాజేష్(20), వేటగిరి బాలయ్య(45), మండాది కాళిబాబు (52) విద్యుదాఘాతానికి గురై నిమిషాల్లోనే దుర్మరణం చెందారు. ఒకరిని కాపాడే యత్నంలో మరొకరు, ఇలా వరుసగా నలుగురు మృత్యువాత పడ్డారు. సంఘటనపై మంత్రి గొట్టిపాటి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

- విద్యుదాఘాతంతో నలుగురు అక్కడికక్కడే దుర్మరణం
- గోశాలలో బావిని శుభ్రం చేస్తుండగా ప్రమాదం


ప్రమాదానికి కారణమైన వరల బావి


సీసీ కెమెరాలతో పర్యవేక్షణ

# నిఘా నీడలో.. ఇంటర్ పరీక్షలు

- ప్రతి గదిలో సీసీ కెమెరాల పర్యవేక్షణ
- ప్రతి ప్రశ్నా పత్రానికి క్యూఆర్‌కోడ్
- సీసీ కెమెరాల నిఘాలోనే ప్రశ్నాపత్రాలు సీల్ తీయాలి
- జవాబు పత్రాల బండిల్స్ ప్యాకింగ్ కెమెరాల నిఘాలోనే..
- వాట్సప్ నుంచి హాల్‌టిక్కెట్లు డౌన్‌లోడుకు ఆస్కారం

**ఒక్కో పరీక్షా కేంద్రంలో గేటు బయట.. ప్రతి గదిలో సగటు రెండుకు పైగా సీసీ కెమెరాలు. వాటి ద్వారా అనుక్షణం జిల్లా కేంద్రంలో, రాష్ట్ర కార్యాలయంలో పర్యవేక్షణ చేసే యంత్రాంగం. ప్రతి ప్రశ్నా పత్రానికి బార్ కోడింగ్.. క్యూఆర్ కోడ్ స్కానర్.. పొరపాటున ప్రశ్నా పత్రం బయటకు వెళితే ఏ జిల్లాలో.. ఏ ఊరిలో.. ఏ కేంద్రంలో ప్రశ్నా పత్రం బయటకు వచ్చిందని తెలుసుకునే సాంకేతిక పరిజ్ఞానం.. పటిష్టమైన కస్టోడియన్ కేంద్రాలు.. అక్కడ నుంచి ప్రశ్నా పత్రాలు తరలించేందుకు ప్రత్యేక రూట్ మ్యాప్‌లు... నిత్యం పరీక్షల్ని పర్యవేక్షించేందుకు సిట్టింగ్, ఫ్లయింగ్ స్క్వాడ్స్. ఇలా కట్టుదిట్టమైన భద్రత నడుమ ఇంటర్ పరీక్షలు ఈ ఏడాది నిర్వహించనున్నారు. గతంలో ఎప్పుడు లేని విధంగా అనేక నూతన సంస్కరణలు ఇంటర్ పరీక్షల కోసం ప్రవేశపెట్టారు.**

గుంటూరు(విద్య), ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): మార్చి 1 నుంచి ప్రారంభం అయ్యే పరీక్షల్ని ప్రశాంత వాతావరణంలో, కట్టుదిట్టు మైన భద్రత నడుమ నిర్వహించేలా ఇంటర్ బోర్డు ఏర్పాట్లు చేసింది. ఇప్పటికే జిల్లాకు కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినర్‌గా ఎస్‌వీ సుబ్బారావు, పరీక్షల ప్రత్యేక అధికారిగా డీవీఈవో పద్మను ప్రభుత్వం నియమించి పరీక్ష నిర్వహణపై ప్రణాళికలు సిద్ధం చేశారు. పరీక్షల నిర్వహణలో కీలక భూమిక పోషించే చీఫ్ సూపరింటెండెంట్స్(సీఎస్‌లు), డిపార్టుమెంట్ ఆఫీసర్ల(డీవో)లతో సమీక్ష నిర్వహించిపరీక్ష కోసం విస్తృత ఏర్పాట్లు చేయడంతో పాటు ప్రశాంత వాతావరణంలో విద్యార్థులు పరీక్షలు రాసేలా ఏర్పాట్లు చేయాలని కేంద్రాల నిర్వాహకులకు దిశా నిర్దేశం చేశారు. ఈ ఏడాది ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్షలకు 34,273 మంది, ద్వితీయ సంవత్సరం పరీక్షలకు 34,973 మంది, ఇంటర్ మొదటి సంవత్సరం వృత్తి విద్యా కోర్సుల పరీక్షలకు 1215 మంది, ద్వితీయ సంవత్సరం పరీక్షలకు 867 మంది చొప్పున మొత్తం 71,528 మంది విద్యా ర్థిని విద్యార్థులు పరీక్ష హాజరుకానున్నట్లు తెలిపారు. మొత్తం 81 పరీక్షా కేంద్రాలు ఉన్నాయి. గేటు బయట ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు ద్వారా విద్యార్థులు, ఇతర పర్యవేక్షణ సిబ్బంది రాకపోకల్ని గమనిస్తారు. గదుల్లో ఏర్పాటు చేసిన కెమెరాల కిందనే ప్రశ్నా పత్రాల సీల్ తీయడం, జవాబు (మిగతా 8వ పేజీలో)

# నకిలీ విత్తనాల అడ్డా.. ఆటోనగర్


గుంటూరు నుంచి బంగ్లాదేశ్‌కు లారీలో జూట్ విత్తనాలు

- లైసెన్స్ లేకున్నా ప్రాసెసింగ్ ప్రక్రియ
- జూట్ విత్తనాలు బంగ్లాదేశ్ కు తరలింపు
- నకిలీ పత్తి, మిరప విత్తనాలకు ఇక్కడ హంగులు
- బీజీ-2 మాదిరిగానే బీజీ-3 అమ్మకం
- కళ్లు తెరవకుంటే ఖరీఫ్ గుల్లే

గుంటూరు సిటీ, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): గుంటూరు ఆటోనగర్ నకిలీ విత్తనాల హబ్‌గా మారింది. ఇక్కడ కొన్ని కంపెనీలు లైసెన్సుతో విత్తనాల ప్రాసెసింగ్ చేస్తున్నాయి. సందట్లో సడేమియా అన్నట్లుగా మరికొన్ని కంపెనీలు అసలు అనుమతి లేకుండానే భారీ విత్తన వ్యాపారం గుట్టుగా సాగిస్తున్నాయి. ఎక్కడో ఫెయిల్ అయిన విత్తనాలు ఇక్కడకు తీసుకువచ్చి ప్రాసెసింగ్ పేరుతో వినియోగంలోకి తెచ్చే ప్రక్రియ గత కొన్ని సంవత్సరాలుగా నిరాటంకంగా కొనసాగుతోంది. ఇక్కడ ప్రాసెసింగ్ చేసిన జూట్ విత్తనాలను బంగ్లాదేశ్, నేపాల్ తదితర ప్రాం తాలకు ఎక్కువ మొత్తంలో పంపటం అనేది చాలా గోప్యంగా జరుగుతుంది. వస్తున్నాయో.. పోతున్నాయో.. తెలియదు కానీ గుం టూరులోని పార్శిల్ కార్యాలయాలు మాత్రం వ్యవసాయ సంబంధిత బస్తాలు, అట్ట పెట్టలతో కిక్కిరిసి పోతుంటాయి.

### మొదలైన ఖరీఫ్ హడావుడి..

రబీ సాగు చివరకు వచ్చింది. ఒక్క పంటకు మాత్రమే ప్రాధాన్యం ఇచ్చే రైతులు ఖరీఫ్ కోసం ఎదురు చూస్తుంటారు. అందుకు సంబంధించిన విత్తనాల హడావుడి మాత్రం ఫిబ్రవరి నుంచి ఆరంభం అవుతుంది. కంపెనీలు కూడా ఈ మార్చికి నిల్వలను అన్ని ప్రాంతాలకు చేరవేస్తాయి. అందులో భాగంగా విత్తనాల ప్రాసెసింగ్ యూనిట్లు తీరిక లేకుండా పనిచేస్తున్నాయి. గుంటూరు ఆటోనగర్‌లో కొన్ని లైసెన్సు కంపెనీలు వివిధ రకాల విత్తనాలను ప్రాసెసింగ్ చేస్తున్నాయి. లైసెన్సు ఉన్న వారి వద్ద చిన్నా, చితక వ్యాపారులు కూడా కొన్ని రకాల విత్తనాలను ప్రాసెసింగ్ చేయిస్తున్నారు. వాటిని రైతులకు విక్రయించేందుకు సిద్ధ పరుస్తున్నారు.

### అనుమతి కొందరికే...

ప్రస్తుతం జూట్ ఎగుమతి జోరుగా సాగుతోంది. ఇక్కడ వాస్తవానికి అనుమతి పొందిన వ్యాపారులు కొద్ది మంది మాత్రమే ఉన్నారు. కానీ సుమారు 100 మంది జూట్‌ను ఇతర దేశాలు, రాష్ట్రాలకు సరఫరా చేస్తున్నారు. లైసెన్సు లేకుండా ప్రాసెసింగ్ చేయించి బంగ్లాదేశ్, నేపాల్, గుజరాత్, మహారాష్ట్ర తదితర ప్రాంతాలకు సరఫరా చేస్తున్నారు. జనవరి, ఫిబ్రవరి మాసాల్లో గుంటూరు నుంచి ఆయా ప్రాంతాలకు లెక్కకు మించిన సంఖ్యలో జూట్ ఎగుమతి చేస్తున్నారు. ఎర్రజూట్,నల్ల జూట్ విత్తనాలును వేర్వేగా పంపటం జరుగుతుంది. రైతు వద్ద నుంచి అతితక్కువ ధర కు కొనుగోలు చేసి, ప్రాసెసింగ్ పేరుతో అతి ఎక్కువకు విక్రయిస్తున్నట్లు తెలుస్తోంది. ఆటోనగర్ నుంచి రోజుకు 10 లారీలకు తగ్గకుండా జూట్ ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నట్లు తెలుస్తుంది. ఇక్కడే మినుముల (మిగతా 6వ పేజీలో)

# పీడీఎఫ్ హ్యాట్రిక్ కొట్టేనా..?

- 2013, 2019లో వరుసగా గెలుపు
- పట్టు కోసం కూటమి వ్యూహాలు

గుంటూరు, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కృష్ణా - గుంటూరు పట్టభద్రుల శాసనమండలి నియోజకవర్గ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ విజయం సాధించి 18 ఏళ్ల అయింది. శాసనమండలి పునరుద్ధరణ తర్వాత జరిగిన తొలి ఎన్నికల్లో గెలుపొందిన టీడీపీ ఆ తర్వాత జరిగిన రెండు ఎన్నికల్లోనూ పార్టీ మద్దతుతో పోటీ చేసిన అభ్యర్థులు ఓటమి పాలయ్యారు. దీంతో గత రెండు పర్యాయాల నుంచి ఈ నియోజకవర్గంలో గెలుపు టీడీపీకి నిరాశనే మిగిల్చింది. దీంతో ఈ దఫా ఎలాగైనా గెలుపొందాలన్న పట్టుదలని ఆ పార్టీ నాయకత్వం, క్యాడర్, బీజేపీ, జనసేనలు ప్రదర్శిస్తున్నాయి. మరోవైపు వరుసగా మూడోసారి విజయం సాధించి హ్యాట్రిక్ కొట్టేందుకు పీడీఎఫ్ గ్రౌండ్‌వర్కు చేసుకుంటున్నది. శాసనమండలి పునరుద్ధరణ జరిగిన తర్వాత తొలిసారిగా 2007లో ఉమ్మడి కృష్ణా - గుంటూరు పట్టభద్రుల నియోజకవర్గం ఎమ్మెల్సీ ఎన్నికలు జరిగాయి. ఆ ఎన్నికల్లో టీడీపీ మద్దతుతో బరిలోకి దిగిన చిగురుపాటి వరప్రసాద్ విజయం (మిగతా 6వ పేజీలో)


మెట్ల పూజ చేస్తున్న యవతులు • స్వామిని దర్శించుకొనేందుకు క్యూలైన్‌లో భక్తులు

# కోటప్పకొండలో... భక్తుల సందడి

- ప్రారంభమైన తిరునాళ్ల ఉత్సవాలు
- త్రికోటేశ్వరునికి విశేష అభిషేకాలు
- కొండకు తరలి వచ్చిన ప్రభలు

8

## అమరేశ్వరుని దర్శించుకున్న కలెక్టర్, ఎస్పీ



అమరేశ్వరుని దర్శించుకుంటున్న కలెక్టర్ అరుణ్‌బాబు, ఎస్పీ శ్రీనివాసరావు

అమరావతి, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన బాలచాముండికా సమేత అమరేశ్వరాలయంను జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు, ఎస్పీ కె.శ్రీనివాసరావు సోమవారం సాయంత్రం దర్శించుకున్నారు. అధికారులకు ఈవో పి.సునీల్‌కుమార్ స్వాగతం పలికి ఆలయంలోకి తీసుకెళ్లారు. కలెక్టర్, ఎస్పీ పేరు మీద ఆలయ అర్చకులు స్వామివారికి పూజలు నిర్వహించి ఆశీర్వచనం, తీర్థ ప్రసాదాలు అందజేశారు. అధికారుల వెంట ఆర్డీవో రమణాకాంత్‌రెడ్డి, డీఎస్పీ ఎం.హనుమంతరావు, సీఐ అచ్చయ్య, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

## ఆగిన రైలు.. ఆగ్రహించిన ప్రయాణికులు

- గంటా 22 నిమిషాలు నిలిపివేత
- కారణం చెప్పాలని స్టేషన్ మాస్టర్‌ను నిలదీత



స్టేషన్ మాస్టర్‌ను నిలదీస్తున్న ప్రయాణికులు

వేమూరు, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): రేపల్లె నుంచి గుంటూరుకు వెళ్లే ప్యాసింజర్ రైలును వేమూరు స్టేషన్ రెండో నంబరు ప్లాట్‌ఫాంలో 1 గంట 22 నిమిషాల పాటు ఆపివేశారు. ఆ సమయంలో ఎండ తీవ్రత ఎక్కువగా ఉండటంతో ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు. రైలు డ్రైవర్‌ను ప్రయాణికులు ప్రశ్నించగా సిగ్నల్ ఇవ్వని కారణంగా స్టేషన్‌లో నిలిపి వేశానని చెప్పారు. స్టేషన్ మాస్టర్‌ను కారణం చెప్పమని వారు అడుగగా ఫోన్‌లో మాట్లాడుతూ, సెల్ ద్వారా ప్రయాణికులను వీడియోలు తీస్తుండటంతో వారు ఆగ్రహించారు. సమాధానం చెప్పకుండా మమ్మల్ని వీడియో తీస్తారా అంటూ నిలదీశారు. సమీపంలో ఉన్న రైల్వే ఏఎస్ఐ ప్రయాణికులకు నచ్చజెప్పి శాంతింపజేశారు. రేపల్లె నుంచి 9 గంటల 59 నిమిషాలకు వేమూరుకు రావాల్సిన రైలు 11 గంటల 11 నిమిషాలకు చేరుకుంది. అప్పటి నుంచి 12.33 వరకు ప్లాట్ ఫారంపైన నిలిపి వేశారు. తీరా రైలును ఎందుకు నిలిపివేశారు అన్న దానిపై ఆరా తీయగా, తెనాలి, సంగంజాగర్లమూడి స్టేషన్‌లో ట్రాక్ మరమ్మతులు చేపట్టడం వలన నిలిపి వేసినట్లు తెలిసింది. ఈ విషయం ప్రయాణికులకు తెలియడంతో అలాంటప్పుడు ట్రైన్‌ను రేపల్లెలోనే ఆపి వేసి ట్రిప్ క్యాన్సిల్ చేయవచ్చు కదా అని ప్రశ్నించారు. ఇందుకు రైల్వే సిబ్బంది ఎలాంటి సమాధానం ఇవ్వలేకపోయారు. ప్రయాణికులు చివరకు ఆందోళన చేపట్టేందుకు సిద్ధమవుతున్న తరుణంలో పరిస్థితిని స్టేషన్ మాస్టర్ ఉన్నతాధికారులకు తెలిపారు. దీంతో గుంటూరు నుంచి రేపల్లెకు వెళ్లే ప్యాసింజర్ రైలు తెనాలి స్టేషన్ నుంచి వదిలారు. వేమూరు స్టేషన్‌లోని 1వ నంబరు ప్లాట్‌ఫారంకు రైలు 28 నిమిషాలు ఆలస్యంగా 12.30 నిమిషాలకు చేరుకుంది. నిలిచిపోయిన గుంటూరు వెళ్లాల్సిన రైలును 12.33 నిమిషాలకు వదిలారు. రైల్వే శాఖ అధికారుల తీరుపై ప్రయాణికులు అనేక విమర్శలు చేస్తూ ఆగ్రహం వ్యక్తం చేశారు.

# ఉసురు తీసిన వరలబావి

- విద్యుదాఘాతంతో నలుగురు అక్కడికక్కడే దుర్మరణం
- గోశాలలో బావిని శుభ్రం చేస్తుండగా ప్రమాదం
- ఘటనా స్థలాన్ని పరిశీలించిన జిల్లా ఎస్పీ సతీష్ కుమార్
- దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన మంత్రి గొట్టిపాటి రవి కుమార్



సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న గుంటూరు ఎస్పీ సతీష్ కుమార్

పెదకాకాని, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): రెక్కాడితేగానీ.. డొక్కాడని బడుగు జీవులు ఆ కూలీలు. బతకడం కోసం ఉన్న ఊరిని వదులుకొని వచ్చారు. ఏడాదిగా పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. సోమవారం మృత్యువాత పడ్డారు. వివరాల్లోకి వెళ్తే.. పెదకాకాని సమీపంలోని నంబూరు కాశీ బాబా ఆశ్రమ సమీపంలో గోశాలలో ఈ సంఘటన జరిగింది. తెనాలి సమీపంలోని చినరావూరుకు చెందిన గండాల మహంకాళి(29), వేటగిరి బాలయ్య(45), దుగ్గిరాల మండలం పెనుమూడి గ్రామానికి చెందిన యాకుల రాజేష్ (20) అనే ముగ్గురు ఏడాదిగా గోశాలలో కూలీలుగా పనిచేస్తున్నారు. గోశాలలో సేవ చేసేందుకు సత్తెనపల్లి సమీపంలోని కట్టమూరు గ్రామానికి చెందిన మండాది కాళిబాబు(52) గోశాల వద్దకు వచ్చాడు. వరలబావిలోకి దిగి శుభ్రం చేసే క్రమంలో లోపల ఉన్న వేస్ట్ వాటర్ బయటికి పంపేందుకు విద్యుత్ కంప్రెషర్‌తో ప్రయత్నించారు. కంప్రెషర్‌కు ఉన్న వైర్లు తెగి విద్యుత్ సరఫరా అయింది. బావిలోకి ఇనుపనిచ్చిన వేసుకొని దిగడంతో తొలుత గండాల మహంకాళి విద్యుదాఘాతానికి గురైయ్యాడు. గమనించిన యాకుల రాజేష్ అతన్ని కాపాడేందుకు వెళ్లి విద్యుదాఘాతానికి గురైయ్యాడు. వీరిని కాపాడే యత్నంలో వేటగిరి బాలయ్య, మండాది కాళిబాబు విద్యుదాఘాతానికి గురై నిమిషాల్లోనే దుర్మరణం చెందారు. మండాది కాళిబాబు(52) గోవులకు సేవ చేసేందుకు వచ్చి మృత్యువాత పడ్డాడు. ఆవులకు సేవ చేస్తే పుణ్యం దక్కుతుందని వచ్చి మృతి చెందాడు.

### విషాదఛాయలు...

నలుగురు మృతి చెందటంతో ఆ ప్రాంతమంతా విషాదఛాయలు అలుముకున్నాయి. సంఘటనా స్థలాన్ని గుంటూరు జిల్లా ఎస్పీ సతీష్ కుమార్, మంగళగిరి డీఎస్పీ మురళీకృష్ణ, పెదకాకాని సీఐ నారాయణస్వామి పరిశీలించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రి నుంచి మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పెదకాకాని సీఐ తెలిపారు.

### ప్రభుత్వం అండగా ఉంటుంది

విద్యుదాఘాతం ఘటనపై మంత్రి గొట్టిపాటి రవి కుమార్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. చనిపోయిన నలుగురు కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఘటనపై స్థానిక శాసన సభ్యుడు ధూళిపాళ్ల నరేంద్రతోపాటు స్థానిక అధికారులతో కూడా మంత్రి మాట్లాడారు. ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. మృతుల కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు.

# మహాశివరాత్రికి ఆర్టీసీ సన్నద్ధం

- కోటప్పకొండకు 550 బస్సులు సిద్ధం
- గుంటూరు నుంచి శైవక్షేత్రాలకు 200 సర్వీసులు

గుంటూరు, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి ఉత్సవాలకు ఆర్టీసీ సమాయత్తమైంది. రాష్ట్రంలో ప్రసిద్ధ శైవక్షేత్రాలలో ఒకటైన కోటప్పకొండ తిరునాళ్లకు ఆర్టీసీ విస్తృత ఏర్పాట్లు చేస్తోంది. ఒక్క కోటప్పకొండ తిరునాళ్లకు 550 బస్సులను సిద్ధం చేశారు. ఇప్పటికే జోనల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ నాగేంద్ర ప్రసాద్, పల్నాడు జిల్లా ప్రజా రవాణాధికారి ఎన్‌వీ శ్రీనివాసరావు కోటప్పకొండ వద్ద పర్యటించి ఆర్టీసీ ఏర్పాట్లుపై ప్రత్యేకంగా పరిశీలించారు. గుంటూరు నుంచి నరసరావుపేటకు చేరుకునేందుకు గుంటూరు-1 డిపో నుంచి 20 సర్వీసులు అందుబాటులో ఉంచుతున్నారు. నరసరావుపేట నుంచి కోటప్పకొండ బస్సులు నిరంతరం అందుబాటులో ఉంటాయని గుంటూరు జిల్లా ప్రజా రవాణాధికారి (డీపీటీవో ) ఎమ్ రవికాంత్ తెలిపారు. ఇతర శైవక్షేత్రాలైన అమరావతి, గోవాడ, క్వారీ వంటి క్షేత్రాలకు మరో 180 బస్సులను సిద్ధం చేశారు. 25వ తేదీ సాయంత్రం నుంచే ప్రత్యేక బస్సులు అందుబాటులోకి తెస్తున్నట్లు తెలిపారు. ముఖ్యంగా కోటప్పకొండ జాతర కోసం కొండ పైకి...కిందికి రాకపోకలు సాగించేందుకు తిరుపతి నుంచి మినీ బస్సులను అందుబాటులోకి తెస్తున్నారు. భక్తుల రద్దీని అనుసరించి ముందుగా 60 బస్సులను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు.

### కోటప్పకొండ తిరునాళ్లకు 105 ప్రత్యేక బస్సులు



రాంబాబు, చిలకలూరిపేట డిపో మేనేజర్

చిలకలూరిపేట, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి సందర్భంగా కోటప్పకొండ తిరునాళ్లకు చిలకలూరిపేట ఆర్టీసీ బస్సు డిపో నుంచి 105 ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేస్తున్నట్లు డిపో మేనేజర్ ఎస్ రాంబాబు సోమవారం తెలిపారు. చిలకలూరిపేట నుంచి కోటప్పకొండకు రూ.30 చార్జిగా నిర్ణయించినట్టు చెప్పారు. బస్సులు వెళ్లేటప్పుడు, వచ్చేటప్పుడు వేర్వేరు మార్గాలలో నడుస్తాయని ఆయన వివరించారు. కోటప్పకొండకు వెళ్లేందుకు పురుషోత్తమపట్నం అడ్డరోడ్డు దిగువన ఉన్న ప్రాంతం నుంచి ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసినట్లు వివరించారు. తిరునాళ్ల ప్రత్యేక బస్సులు ఈనెల 26వ తేదీ తెల్లవారుజాము నుంచి 24 గంటల పాటు నడుస్తాయని వివరించారు.

# నకిలీ విత్తనాల అడ్డా.. ఆటోనగర్

(5వ పేజీ తరువాయి)

విత్తనాలను ప్రాసెసింగ్ చేస్తున్నారు. ఎక్కడెక్కడో కొనుగోలు చేసి తీసుకువచ్చిన విత్తనాలను అందమైన ప్యాక్ లలో నింపుతున్నారు.

### బీజీ-2 కాదు..బీజీ-3

ఆటోనగర్ వేదికగా బయటకు వస్తున్న పత్తి విత్తనాలపై పలు ఆరోపణలు ఉన్నాయి. వాస్తవానికి బీజీ-2 పత్తి విత్తనాలను మాత్రమే సాగు చేయాలి. అయితే ప్రభుత్వ అనుమతి లేని బీజీ-3 విత్తనాలను ఇక్కడ నుంచి సరఫరా చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. బీజీ-2 విత్తనాల ప్యాకెట్లలోనే వాటిని నింపి అమ్మకాలు జరుపుతున్నారన్న వాదన ఉంది. మిరప విత్తనాలు కూడా బెంగుళూరు ప్రాంతం నుంచి తీసుకువచ్చి ఇక్కడి గోడౌన్లలోనే ఉంచుతున్నారు. అక్కడ ప్రముఖ కంపెనీల లో ఫెయిల్ అయిన లాట్స్ ను ఇక్కడ కు తెచ్చి అమ్మకాలు జరుపుతున్నారు.

### 47 పార్సిల్స్...

గుంటూరు లో 47 పార్సిల్స్ కార్యాలయాలు ఉన్నాయి. రాష్ట్రంలోని ఎక్కడ నుంచి ఎక్కడకు సరుకు వెళ్లాలన్నా ఇక్కడ కు రావాల్సిందే.నకిలీ విత్తనాలు కూడా ఆయా పార్సిల్స్ ద్వారానే అటు ఇటు సరఫరా అవుతున్నాయి. గతంలో అధికారులు ఆయా పార్సిల్స్ లో తనిఖీ లు నిర్వహించి కేసులు నమోదు చేశారు. తనిఖీ లకు వెళ్లిన ప్రతి సారి ఏదో ఒక కేసు నమోదు అయ్యింది. ఈ మధ్య కాలంలో తనిఖీ లు బొత్తిగా లేవన్న వాదన వినిపిస్తోంది. ఖరీఫ్ లో రైతులు నకిలీ విత్తనాల బారీన పడకుండా ఉండాలంటే ఆటోనగర్ తో పాటు,పార్సిల్స్ కార్యాలయాలపై దృష్టి కేంద్రీకరించాలని పలువురు సూచిస్తున్నారు.

# పీడీఎఫ్.. హ్యాట్రిక్ కొట్టేనా..?

(5వ పేజీ తరువాయి)

సాధించారు. అయితే ఆయన ఎమ్మెల్సీగా విజయవాడకే ఎక్కువగా పరిమితమయ్యారు. దాంతో గుంటూరు జిల్లాకు చెందిన పార్టీ నేతలు 2013లో ఆయన అభ్యర్థిత్వాన్ని వ్యతిరేకించారు. సీఎం చంద్రబాబు అప్పటి నేతలను పిలిపించుకుని మాట్లాడి తిరిగి వరప్రసాద్‌కే మద్దతు ప్రకటించారు. ఆ ఎన్నికల్లో పీడీఎఫ్ అభ్యర్థి బొడ్డు నాగేశ్వరరావు రెండో ప్రాధాన్య ఓట్ల లెక్కింపులో గెలుపొందారు. 2019లో సాధారణ ఎన్నికలకు నెల ముందు పట్టభద్రుల ఎన్నికలు వచ్చాయి. దాంతో టీడీపీ ప్రత్యక్షంగా ఫలాన అభ్యర్థికి తాము మద్దతిస్తున్నామని ప్రకటించలేదు. అయితే శ్రీచైతన్య విద్యా సంస్థల ఏజీఎం నూతలపాటి అంజయ్య పోటీ చేసి టీడీపీ మద్దతు తనకే ఉందని ప్రకటించుకున్నారు. ఆ ఎన్నికల్లో పీడీఎఫ్ అభ్యర్థిగా కేఎస్ లక్ష్మణరావు పోటీ చేసి రెండో ప్రాధాన్య ఓట్ల లెక్కింపులో విజయం సాధించారు.

### ఆలపాటి, లక్ష్మణరావు మధ్య హోరాహోరీ

ఉమ్మడి కృష్ణా - గుంటూరు పట్టభద్రుల శాసనమండలి నియోజకవర్గానికి నాల్గో దఫా ఎన్నికలు జరగబోతున్నాయి. దీంతో ఎలాగైనా విజయం సాధించి పూర్వవైభవం సంతరించుకోవాలని టీడీపీ కూటమి విస్తృతంగా ప్రచారం చేస్తున్నది. కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కి మద్దతుగా జనసేన, బీజేపీ నాయకులు ప్రచారంలోకి దిగారు. కొన్ని ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాల మద్దతు కూడా టీడీపీ కూడగట్టుకున్నది. మరోవైపు పీడీఎఫ్ అభ్యర్థి లక్ష్మణరావు గెలుపు కోసం ఉపాధ్యాయ సంఘాలు గత కొన్ని రోజుల నుంచి గ్రౌండ్‌వర్కు చేస్తున్నాయి. ఉపాధ్యాయ సంఘాల నేతలు వివిధ ఉద్యోగ సంఘాల నాయకులను కలుసుకుని లక్ష్మణరావుకు మద్దతుని కూడగడుతున్నాయి. ఈ నేపథ్యంలో పోటీ హోరాహోరీగా మారుతుందన్న అభిప్రాయం వ్యక్తమౌతున్నది. తొలి ప్రాధాన్య ఓట్ల లెక్కింపులో విజయం తేలకపోవచ్చని, రెండో ప్రాధాన్య ఓట్ల లెక్కింపుతోనే ఫలితం వస్తుందని అంచనా వేస్తున్నారు. సాధారణ ఎన్నికలతో పోలిస్తే పట్టభద్రుల శాసనమండలి ఎన్నికలు భిన్నం కావడంతో తొలి ప్రాధాన్య ఓటు కోసమే అభ్యర్థులు ప్రయత్నిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఇరువర్గాలు ప్రచార, ఆత్మీయ సమావేశాలను ముమ్మరం చేశాయి.

## దర్శనానికి 10 వేలకు పైగా వీఐపీ పాసులు

నరసరావుపేట, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి సందర్భంగా కోటప్పకొండ త్రికోటేశ్వర స్వామి తిరునాళ్లకు భారీగానే గతేడాది తరహాలోనే వీఐపీ పాసులు జారీ చేసేందుకు పోలీసు శాఖ ఏర్పాట్లు చేసింది. త్రికోటేశ్వర స్వామిని దర్శించుకునేందుకు వీఐపీల కోసం 10 వేలకు పైగా పాసులు జారీ చేయనున్నారు. నరసరావుపేట డీఎస్పీ కార్యాలయంలో వీఐపీ దర్శనం పాసులు జారీ చేయనున్నట్లు సమాచారం. గతేడాది వైసీపీ నేతలు వేల సంఖ్యలో వీఐపీ దర్శనం పాసులు జారీ చేశారు. వైసీపీ హయాం నుంచే వేల సంఖ్యలో వీఐపీ పాసులు జారీ ప్రారంభమైంది. దీనిని కూటమి ప్రభుత్వం కూడా కొనసాగిస్తోంది. పార్టీ నేతలు, కార్యకర్తలకే అధిక సంఖ్యలో వీఐపీ పాసులు జారీ చేయనున్నారు. వీఐపీ పాసులు జారీ చేసే అధికారం దేవస్థానంకే ఉంది. అయితే దేవస్థానం నుంచి పాసులు జారీని పోలీసు శాఖ తీసుకోవడం గమనార్హం. దేవస్థానం ఈవో సంతకంతో ఉన్న స్టాంపును కూడా పోలీసు అధికారులు తీసుకున్నట్టు తెలిసింది. ఈవో పేరుతోనే ఆయన సంతకం ఉన్న స్టాంపును ముద్రించి పాసులు పోలీసు శాఖ జారీ చేస్తుండటం గమనార్హం. వీఐపీ పాసుల జారీ అంశంపై ఈవో చంద్రశేఖరరావును వివరణ కోరగా దేవస్థానం కార్యాలయం నుంచి పాసులు జారీ చేయడంలేదనీ, పోలీసు శాఖ పాసులు జారీ చేస్తుందని తెలిపారు. వీఐపీ వాహన పాసులను కూడా పోలీసు శాఖ జారీ చేస్తుంది. వీఐపీల కోసం దాదాపు 20 ఆర్టీసీ సర్వీసులను కొండ కింద నుంచి కొండపైకి నిర్వహించనున్నారు.

## యువతి ఆత్మహత్యాయత్నం

వినుకొండ టౌన్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): వినుకొండ పట్టణంలోని హనుమాన్ నగర్‌కు చెందిన వైసీపీ యువజన విభాగ అధ్యక్షుడు గత ఐదేళ్లుగా నమ్మించి మోసంచేసి, గుట్టుచప్పుడు కాకుండా మరో యువతితో వివాహం చేసుకోవడంతో, కలత చెందిన ఓ యువతి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన సోమవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. హనుమాన్‌నగర్‌కు చెందిన అత్తర్ నాగూర్ పెళ్లి చేసుకుంటానని ఓ యువతిని నమ్మించి మోసగించాడు. ప్రశ్నించిన యువతి ఇంటిపై దాడి చేశాడు. దీంతో కలత చెందిన యువతి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. విషయం తెలుసుకున్న బంధువులు ఆమెను స్థానిక ప్రైవేట్ వైద్యశాలకు తరలించి చికిత్స చేయిస్తున్నారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తామని పోలీసులు తెలిపారు. గతంలో ఆమె ఫిర్యాదు చేసిన కేసులో నాగూర్ జైలుకు కూడా వెళ్లారని పోలీసులు తెలిపారు.

## ఓట్ల లెక్కింపు సమర్థవంతంగా నిర్వహించాలి

- ఎన్నికల రిటర్నింగ్ అధికారి నాగలక్ష్మి



జిల్లా పరిషత్తులో బ్యాలెట్ బాక్సులను పరిశీలిస్తున్న కలెక్టర్, జేసీ, డీఆర్వో

గుంటూరు, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కృష్ణా - గుంటూరు పట్టభద్రుల నియోజకవర్గ శాసనమండలి ఎన్నికల ఓట్లు ఏకాగ్రతతో, సమర్థవంతంగా, కచ్చితంగా, సత్వరమే లెక్కింపు చేయాలని రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి కౌంటింగ్ విధులు కేటాయించిన ఉద్యోగులు, పర్యవేక్షణ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని శంకరన్ హాలులో ఆమె సంయుక్త కలెక్టర్ ఏ భార్గవ్ తేజ, తెనాలి సబ్ కలెక్టర్ సంజనా సిన్హా, నూజివీడు సబ్ కలెక్టర్ స్మరణ్ రాజులతో కలిసి శాసనమండలి ఎన్నికల కౌంటింగ్ కేంద్రంలో విధులు కేటాయించిన ఓట్లు లెక్కింపు సిబ్బంది, టేబుల్ సూపర్‌వైజర్లు, రో ఇన్‌చార్జిలు పర్యవేక్షణ అధికారులకు శిక్షణ నిర్వహించారు. ఈఆర్‌వో నాగలక్ష్మి మాట్లాడుతూ శాసనమండలి ఎన్నికలు బ్యాలెట్ పేపరు, మొదటి ప్రాధాన్యత ఓటు నమోదు విధానం ద్వారా జరుగుతున్న నేపథ్యంలో ఓట్లు లెక్కింపు చాలా జాగ్రత్తగా చేపట్టాలన్నారు. అభ్యర్థి విజయం సాధించాలంటే పోలైన ఓట్లలో 50 శాతం కంటే ఒక్క ఓటు అధికంగా రావాల్సి ఉందన్నారు. సంయుక్త కలెక్టర్ ఏ భార్గవ్ తేజ మాట్లాడుతూ కౌంటింగ్ కేంద్రం వద్దకు బ్యాలెట్ బాక్సులు తీసుకువచ్చినప్పుడు పోలింగ్ కేంద్రం, పోలైన ఓట్లు, తదితర వివరాలు పూర్తిగా సరిచూసుకోవాలన్నారు. గుంటూరు, పల్నాడు, బాపట్ల, ఎన్టీఆర్ జిల్లాల డీఆర్‌వోలు ఎన్ఎస్ కే ఖాజావలి, మురళి, గంగాధర గౌడ్, చంద్రశేఖర్, ఏలూరు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ముక్కంటి పాల్గొన్నారు.

### బ్యాలెట్ బాక్సులను సక్రమంగా అందజేయాలి

ఉమ్మడి కృష్ణా - గుంటూరు పట్టభద్రుల శాసనమండలి ఎన్నికల ఏర్పాట్లలో భాగంగా పోలింగ్ సిబ్బందికి అందించాల్సిన బ్యాలెట్ బాక్సులు, స్టాట్యుటరీ, నాన్ స్టాట్యుటరీ ఫారాలతో కూడిన కిట్లను రిటర్నింగ్ అధికారి నాగలక్ష్మి పరిశీలించారు. సోమవారం రాత్రి స్థానిక జిల్లా పరిషత్ కార్యాలయంలో ఆమె సంయుక్త కలెక్టర్ ఏ భార్గవ్ తేజతో కలసి వాటిని పరిశీలించారు. మెటీరియల్ మేనేజ్మెంట్, బ్యాలెట్ బాక్సుల నోడల్ అధికారి అయిన జిల్లా పరిషత్ సీఈవో జ్యోతిబసును బ్యాలెట్ బాక్సులకు సీరియల్ నంబర్లు వేసి వాటిని పోలింగ్‌స్టేషన్ల వారీగా సిద్ధపరచాలని సూచించారు. డీఆర్‌ఓ షేక్ ఖాజావలి, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

## త్రికోటేశ్వర స్వామికి పట్టు వస్త్రాలు సమర్పించనున్న మంత్రి ఆనం

నరసరావుపేట, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): ప్రఖ్యాత శైవ క్షేత్రం కోటప్పకొండ త్రికోటేశ్వర స్వామి సన్నిధిలో మహాశివరాత్రి సందర్భంగా 26న తిరునాళ్ల వైభవంగా జరగనుంది. తిరునాళ్లకు రాష్ట్ర పండగ హోదా ప్రభుత్వం కల్పించింది. ఈ నేపథ్యంలో త్రికోటేశ్వరస్వామికి ప్రభుత్వం తరపున పట్టు వస్త్రాలు సమర్పించనున్నారు. దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి స్వామి వారికి ప్రభుత్వం తరపున పట్టు వస్త్రాలు సమర్పిస్తారు. ఈ మేరకు ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. పట్టువస్త్రాలతోపాటు వెండి ప్రభ కూడా సమర్పిస్తారు. ఇందుకు ప్రభుత్వం రూ.20 వేలు దేవస్థానానికి విడుదల చేసింది.

## ధ్యానబుద్ధను సందర్శించిన శ్రీలంక బౌద్ధులు



చారిత్రక ప్రాధాన్యతను వివరిస్తున్న బౌద్ధగురువు

అమరావతి, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) ఇండియన్ మహాబోధి సొసైటీ ఆధ్వర్యంలో శ్రీలంక దేశానికి చెందిన 77 మంది బౌద్ధ భిక్షువులు, మతస్థులు సోమవారం ధ్యానబుద్ధ ప్రాజెక్టును సందర్శించారు. వీరు గత 25 రోజులుగా దేశంలోని ఐదు రాష్ట్రాలలో ఉన్న బౌద్ధ క్షేత్రాలను సందర్శించి చివరిగా అమరావతి చేరుకున్నారు. అమరావతిలోని ధ్యానబుద్ధ ప్రాజెక్టుతోపాటు మహాచైత్యం, అమరేశ్వరాలయం సందర్శించారు. వీరి వెంట ఉన్న బౌద్ధ గురువు అమరావతిలో బౌద్ధ చారిత్రక ప్రాధాన్యతను వారికి వివరించారు.

## కృష్ణానదిలో మత్స్యకారులపై దాడి

మాచర్ల రూరల్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నారాయణరెడ్డిపురం తండా వద్ద కృష్ణా జలాశయంలో ఆంధ్ర ప్రాంత మత్స్యకారులపై తెలంగాణకు చెందిన వ్యక్తులు దాడి చేసి చేపల వలలు అపహరించిన సంఘటన ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. మండలంలోని విజయపురిసౌత్‌కు చెందిన మత్స్యకారులు సుమారు 50 ఏళ్లుగా నారాయణరెడ్డిపురం తండా వద్ద కృష్ణా జలాశయంలో చేపల వేట చేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఆదివారం రాత్రి విజయపురిసౌత్‌కు చెందిన ఎరిపల్లి చిట్టిబాబు, బొడ్డు సత్యరావులు కృష్ణానదిలో వలలు వేసి చేపల వేట చేస్తుండగా తెలంగాణ ప్రాంతంలోని నాయకులతండాకు చెందిన నల్లబాలు, నత్తి రాము, మునితోపాటు మరో ఐదుగురు వ్యక్తులు వారిపై దాడి చేసి వలలు అపహరించుకుపోయారు. వలల విలువ సుమారు రూ. 50 వేలు ఉంటుందని బాధితులు తెలిపారు. విజయపురిసౌత్ పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశారు.

## నాగార్జున సాగర్ కుడికాలువలో యువకుడు గల్లంతు

దుర్గి, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ కుడి కాలువలో యువకుడు గల్లంతైన సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బాపట్ల జిల్లా బలికేశ్వరం మండలం ముత్తేశ్వరం గ్రామానికి చెందిన గుట్టపల్లి అయ్యప్ప (28) తన స్నేహితుడు శ్రీనుతో కలిసి మండలంలోని అడిగొప్పులలోని నిదానంపాటి శ్రీలక్ష్మీ అమ్మవారి దర్శనానికి వచ్చారు. ద్విచక్ర వాహనంపై తిరిగి వెళ్తూ మార్గమధ్యలో కుడికాలువలో ఈతకు దిగి నీటి ప్రవాహానికి కొట్టుకుపోయాడు. విషయం తెలుసుకున్న ఎస్ఐ సుధీర్‌కుమార్ తన సిబ్బందితో గాలింపు చర్యలు చేపట్టారు.



అయ్యప్ప (ఫైల్)

### నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.80
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

### బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

| | |
|---|---|
| బ్రాయిలర్ బర్డ్ | 87, 99,108 |
| చికెన్ విత్ స్కిన్ | 172.00 |
| చికెన్ స్కిన్ లెస్ | 182.00 |

## ఓటు వేసేందుకు కార్మికులకు ప్రత్యేక అనుమతి

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): ఈనెల 27న జరిగే ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు వేసేందుకు కార్మికులకు ప్రత్యేక అనుమతి ఇవ్వాలని ఆయా పరిశ్రమలు, షాపింగ్‌మాల్ యజమానులకు సంయుక్త కార్మిక కమిషనర్ శ్రీనివాస్‌కుమార్ ఆదేశాలు జారీచేశారు. అర్హులైన కార్మికులు, ఉద్యోగులందరూ ఓటుహక్కు వినియోగించుకోనేలా ఆయా సంస్థల యజమానులు కృషి చేయాలన్నారు. విధులో ఉన్నవారికి ఓటు వేసేందుకు రెండుగంటల పాటు సెలవు మంజూరు చేయాలన్నారు. ఎవరైనా అనుమతి నిరాకరిస్తే 94925 55164 నంబరుకు ఫిర్యాదు చేయాలని సూచించారు.

## శంకర్‌విలాస్ ఆర్‌వోబీకి ఆర్‌అండ్‌బీ పరిపాలన అనుమతి

● జీవో నం.84 జారీ

గుంటూరు, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): సెంట్రల్ రోడ్డు ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫండ్ - సేతు బంధన్ స్కీమ్ కింద కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన శంకర్‌విలాస్ ఆర్‌వోబీ నిర్మాణానికి రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖ పరిపాలన అనుమతిని మంజూరుచేసింది. ఈ మేరకు సోమవారం ఆ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ కాంతిలాల్‌దండే జీవో నం.84ని విడుదల చేశారు. దీంతో కొద్దిరోజుల్లోనే ఆ శాఖ సాంకేతిక అనుమతులు మంజూరుచేసి టెండర్లు పిలిచి ఏజెన్సీని ఖరారుచేసి పనులు ప్రారంభించనుంది. నాలుగు వరసల ఈ బ్రిడ్జినిర్మాణానికి కేంద్రప్రభుత్వం తన వాటాగా రూ.98 కోట్లను మంజూరుచేసింది. ఈ మేరకు పరిపాలన అనుమతిని మంజూరు చేయాల్సిందిగా విజ్ఞప్తిచేసింది. దీంతో రోడ్లు భవనాలశాఖ ఆర్డర్స్ పాస్‌చేసింది. ఈ మొత్తాన్ని సీఆర్ఐఎఫ్ నుంచి రీయింబర్స్‌మెంట్ చేస్తారు.

## ఉపాధ్యాయులు ఆలపాటికి అండగా నిలవాలి

● జనసేన నేతలు బోనబోయిన, గాదె



సమావేశంలో పాల్గొన్న నేతలు బోనబోయిన, గాదె తదితరులు

గుంటూరు, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కి అండగా నిలవాలని జనసేన నేతలు బోనబోయిన శ్రీనివాసయాదవ్, గాదె వెంకటేశ్వరరావు విజ్ఞప్తి చేశారు. సోమవారం పార్టీ కార్యాలయంలో ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు, ఉపాధ్యాయులతో ఆత్మీయ సమావేశం ఏర్పాటుచేశారు. సమావేశానికి మేకల రవీంద్రబాబు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా బోనబోయిన, గాదె మాట్లాడుతూ ఆలపాటికి మొదటి ప్రాధాన్య ఓటువేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఆలపాటి సతీమణి మాధవి, జనసేన నాయకులు శ్రీహరి, వంగా శ్రీనివాసరావు, బత్తుల వెంకట్రావు, వీఆర్ మాస్టర్, ఆదిత్య, శివనాగేశ్వరావు, పార్టీ జిల్లా కమిటీ నాయకులు, కార్పొరేటర్లు, నగర కమిటీ నాయకులు పాల్గొన్నారు.

## శివరాత్రి రద్దీ నియంత్రణకు రైల్వేస్టేషన్లలో ప్రత్యేక చర్యలు

● సీనియర్ డీసీఎం ప్రదీప్‌కుమార్

గుంటూరు, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి పండగ సందర్భంగా రైల్వేస్టేషన్లలో ప్రయాణీకుల రద్దీ నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు రైల్వే గుంటూరు సీనియర్ డీసీఎం ప్రదీప్‌కుమార్, డీసీఎం కమలాకర్‌బాబు సంయుక్త ప్రకటనలో తెలిపారు. స్టేషన్లలో ఫుట్ ఓవర్ బ్రిడ్జిలు, ఇతర ప్రాంతాల్లో ప్రయాణీకులకు ఆటంకాలు లేకుండా చర్యలు చేపట్టామన్నారు. స్టేషన్లలో బయలుదేరే రైళ్లకోసం రైలును ముందుగానే ఉంచుతామన్నారు. వీలైనంత వరకు ప్లాట్‌ఫాం నంబరుని ముందుగానే ప్రకటిస్తాం. చివరి నిమిషంలో మార్చాల్సివస్తే ప్రయాణీకులందరిని ఎక్కించే వరకు రైలును స్టార్ట్ చేయబోమన్నారు. రైళ్ల ఆలస్యమైతే తరచుగా ప్రకటనలు చేస్తామన్నారు. హెల్ప్‌డెస్కులు ఏర్పాటుచేసి రైళ్ల సమాచారాన్ని ప్రయాణీకులకు తెలియజేస్తామని చెప్పారు. రైలు ప్రయాణీకులను మాత్రమే ప్లాట్‌ఫాంల పైకి అనుమతిస్తామన్నారు. ఆ రైలు వెళ్లిపోయిన తర్వాతనే తదుపరి వచ్చే రైలు ప్రయాణీకులను లోనికి అనుమతిస్తామన్నారు. ట్రాఫిక్‌ని బట్టి ప్లాట్‌ఫాం టిక్కెట్లను జారీ చేస్తాన్నారు. రైలు వచ్చినప్పుడు ప్రయాణీకులు సులభంగా బోగీలలోకి ఎక్కేలా ఆర్‌పీఎఫ్ సిబ్బంది ఏర్పాట్లు చేస్తారన్నారు.

## బోధన నైపుణ్యాలు పెంచేలా కృషి చేయాలి

గుంటూరు(విద్య), ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో బోధనా నైపుణ్యాలు మెరుగుపడేలా పర్యవేక్షణ ఉండాలని ఎంఈవో అబ్దు ల్ ఖుద్దూస్ సూచించారు. సోమవారం కలెక్టర్ బంగ్లా రోడ్డులోని ఎంఈవో కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతిరోజు పాఠశాలల్ని సందర్శించి బోధన పద్ధతుల్ని పర్యవేక్షించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈవోలు బీవీ రమణయ్య, జ్యోతికిరణ్, నాగేంద్రమ్మ, స్టేట్ కోఆర్డినేటర్ తోట వీరయ్య పాల్గొన్నారు.

## కేఎల్‌పీలో ప్రారంభమైన రాష్ట్రస్థాయి చెస్ పోటీలు

గుంటూరు(విద్య), ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): స్థానిక జేకేసీ కళాశాల రోడ్డులోని కేఎల్‌పీ పబ్లిక్ స్కూల్‌లో ఏపీ స్టేట్ చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చెస్ పోటీలు సోమవారం ప్రారంభమయ్యాయి. వివిధ జిల్లాల నుంచి 264మంది విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారు. విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో చెస్ అసోసియేషన్ కార్యదర్శి వై సుమన్, పాఠశాల కార్యదర్శి డాక్టర్ కొండబోలు కృష్ణప్రసాద్, ప్రిన్సిపాల్ జి.రత్తయ్య, ఏవో వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

## బ్రాడీపేటలో గంజాయిరాయుళ్లు

గుంటూరు, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): నగరంలో బ్రాడీపేట 1/11లో సాయంత్రం 6.30గంటల నుంచి అర్ధరాత్రి వరకు గంజాయిరాయుళ్లు చేరి ఆ ప్రాంతంలో గంజాయి సేవిస్తూ రచ్చరచ్చ చేస్తున్నారు. గంజాయి తెచ్చుకుని ఇక్కడ సేవిస్తున్నారు. మహిళలు, పిల్లలు సాయంత్రం నుంచి రాత్రి బయటకు రావాలంటే భయపడే పరిస్థితి ఉన్నది. స్థానికులు ఎవరైనా నిలదీస్తే వారిపై ఎదురుదాడి చేస్తున్నారు. ఈ గంజాయి బ్యాచ్ స్థానికులకు తీవ్ర అసౌకర్యం కలిగిస్తున్నారు. ఈ నేపథ్యంలో పోలీసులు ప్రత్యేకనిఘాపెట్టి వీళ్లని అరికట్టాలని స్థానికులు కోరుతున్నారు.

## భారీ తెరపై మహాశివరాత్రి వేడుకలు

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రిని పురస్కరించుకుని కోయంబత్తూరు, ఈషా యోగాకేంద్రంలో జరిగే వేడుకలను ప్రత్యక్ష ప్రసారం చేయనున్నట్టు ఈషా వలంటీర్లు ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా స్థానిక టీజేపీఎస్ కళాశాలలో తెరను ఏర్పాటుచేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమం ఈనెల 26 సాయంత్రం 6 గంటలకు ప్రారంభమై, 27 ఉదయం 6వరకు కొనసాగుతుందని వివరించారు. వేడుకల్లో సద్గురుతో ధ్యానం, సంగీత ప్రదర్శనలు, సంప్రదాయ కళారూపాలు, అనేక కార్యక్రమాలు ఉంటాయన్నారు. వివరాలకు 99493 12299, 7337238005 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

## నేటితో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం సమాప్తం

గుంటూరు, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కృష్ణా-గుంటూరు పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికలకు ప్రచారం మంగళవారం సాయంత్రంతో ముగియనుంది. ఈ నెల 27వ తేదీన పోలింగ్ జరగనున్న దృష్ట్యా ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు 48 గంటల ముందుగా 25వ తేదీ సాయంత్రంతో ప్రచారం ముగించాల్సివుంది. ఈ విషయాన్ని ఇప్పటికే జిల్లా ఎన్నికల యంత్రాంగం పోటీలో ఉన్న అభ్యర్థులు/ప్రతినిధులకు తెలిపింది. పోలింగ్ ప్రశాంతంగా జరిగేందుకు వీలుగా మద్యం దుకాణాలకు కూడా సీలు వేయనున్నారు. ప్రచారానికి మంగళవారం ఆఖరిరోజు కావడంతో పెద్దఎత్తున సమావేశాల నిర్వహణకు ప్రణాళిక రూపొందించుకొన్నారు.

## ఎమ్మెల్సీ ఎన్నికలకు పటిష్ట ఏర్పాట్లు

● జీఎంసీ కమిషనర్ శ్రీనివాసులు

● నోడల్ అధికారులతో సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ పులి శ్రీనివాసులు

గుంటూరు కార్పొరేషన్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): గుంటూరు-కృష్ణా జిల్లాల పట్టభద్రుల ఎన్నికల నిర్వహణకు గుం టూరు నగర పాలక సంస్థ పరిధిలో అన్ని ఏర్పాట్లుచేస్తున్నట్లు కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. ఎన్నికల నిర్వహణ, పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతుల కల్పనపై సోమవారం జీఎంసీలోని తన ఛాంబర్‌లో ఎమ్మెల్సీ ఎన్నికల విధుల నిర్వహణలో ఉండే నోడల్ అధికారులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాల వద్ద బ్యారికేట్లతో క్యూలను ఏర్పాటు చేయాలన్నారు. 26వ తేది రాత్రికే ఆయా కేంద్రాలకు ఎన్నికల సిబ్బంది వస్తారని, అక్కడ తాగు నీరు, భోజనం, విద్యుత్ సరఫరాలో సమస్యలు తలెత్తకూడదన్నారు. ప్రజారోగ్య, ఇంజనీరింగ్ అధికారులతో సమన్వయం చేసుకుంటూ అవసరమైన సదుపాయాలు కల్పించాలని ఆదేశించారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో వీడియోగ్రాఫర్లు ఉండేలా చూడాలని, వెబ్ కాస్టింగ్‌ను తప్పనిసరిగా ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో ఎలక్షన్ సెల్ సూపరింటెండెంట్ పద్మనాభరావు పాల్గొన్నారు.

అనంతరం నగర పాలక సంస్థకు చెల్లించాల్సిన మీడియా డిజైజ్ డోస్ట్ ఫీజు బకాయిలను మార్చి 15 వ తేదీ లోపు ఏజెన్సీల వారు చెల్లించాలని, లేని పక్షంలో సదరు హోర్డింగ్ లను తొలగించాలని నగర కమీషనర్ పులి శ్రీనివాసులు పట్టణ ప్రణాళిక అధికారులను ఆదేశించారు. సోమవారం యాడ్ ఏజెన్సీల ప్రతినిధులు, పట్టణ ప్రణాళిక అధికారులతో బకాయిల వసూళ్ళపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. 2024-25 సంవత్సరానికి సంబంధించిన హోర్డింగ్ బకాయి, ఎరియర్స్ మార్చి 15 లోపు నూరు శాతం చెల్లించాలని, లేకుంటే హోర్డింగ్‌లను తొలగించేస్తామని కమిషనర్ హెచ్చరించారు.

**ఉండవల్లి, హెడ్ వాటర్ వర్క్స్ పంప్ హౌస్ పరిశీలన..**

ఉండవల్లి పంపింగ్ హౌస్‌ని కమిషనర్ పరిశీలించారు. రానున్న వేసవిలో జీఎంసీ పరిధిలో తాగునీటి సమస్యల తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని, దీనిపై ప్రత్యేక దృష్టిసారించాలని ఇంజినీరింగ్ అధికారులు ఆదేశించారు. అనంతరం ఆనందపేటలో అవుట్ ఫాల్ డ్రైన్ పూడిక తీత పనులను పరిశీలించి, నూరు శాతం పూడిక తీత పనులు జరగాలని పారిశుధ్య సిబ్బందిని ఆదేశించారు. పర్యటనలో ఎస్ఈ నాగ మల్లేశ్వరరావు, ఈఈ కోటేశ్వరరావు, డిఈఈ శ్రీనివాస్, ట్యాక్స్ పేయర్స్ అసోసియేషన్ నాయకులు పాల్గొన్నారు.

**బుడమేరు ముంపు నిధులు జీఎంసీకి జమ..**

గత ఏడాది సెప్టెంబరులో బుడమేరు వరద విపత్తుల నిర్వహణలో భాగంగా గుంటూరు నగర పాలక సంస్థ తరఫున ఆహార, తాగునీటి సదుపాయాలు ఏర్పాటు చేశామని, అందుకుగాను సీఎంసీ రూ.9.23 కోట్ల ఖర్చును వెచ్చించామని కమిషనర్ తెలిపారు. ఆయా వివరాలను కలెక్టర్ ఆమోదంతో రాష్ట్ర ప్రభుత్వానికి పంపామన్నారు. ఆయా నిధుల్లో రూ.3,69,18,842 జీఎంసీ అకౌంట్‌కి ఎన్టీఆర్ జిల్లా కలెక్టరు 2024 డిశంబర్ 20న జమ చేశారన్నారు.

## మార్క్‌ఫెడ్ ద్వారా మిర్చిని కొనుగోలు చేయాలి

● సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు



మిర్చియార్డులో రైతులతో మాట్లాడుతున్న వీ శ్రీనివాసరావు, పాల్గొన్న సీపీఎం నాయకులు

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం వెంటనే నాఫెడ్, మార్కెఫెడ్ ద్వారా మిర్చిని కొనుగోలు చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వీ శ్రీనివాసరావు అన్నారు. గుంటూరు సీపీఎం కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. క్వింటా రూ.11,781 కన్నా తగ్గితే సాయం చేస్తామని ప్రభుత్వం చెప్పడం హస్యాస్పదంగా ఉందన్నారు. ఈ ధరను ప్రామాణికంగా తీసుకుంటే రైతులకు ఎకరాకు రూ 2 లక్షల నష్టం వస్తుందన్నారు. రైతుకు కిలోకి రూ.90 దక్కితే వినియోగదారుల వద్ద వ్యాపారులు కిలో రూ.400వరకు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. ఈ దోపిడీని అరికట్టేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవడం లేదన్నారు. వ్యాపారులు సిండికేట్‌గా మారి ధరలను తగ్గించేస్తున్నారని ధ్వజమెత్తారు. ఏపీ రైతు సంఘం ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకరరెడ్డి మాట్లాడుతూ అన్ని పంటల ధరలు తగ్గిపోవడం బాధాకరమన్నారు. ప్రభుత్వం స్పందించి మిర్చిక్వింటాను రూ.20 వేలకు కొనాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సీపీఎం నాయకులు వై కేశవరావు, వై.నేతాజి, కె.నళినీకాంత్, కే అజయ్‌కుమార్ పాల్గొన్నారు.

● యార్డులో పర్యటన

తొలుత మిర్చియార్డులో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు, నాయకులు పర్యటించి రైతులతో మాట్లాడారు. తమకు గిట్టుబాటు ధరలు రావడం లేదని గత ఏడాది కన్నా ధరలు పడిపోయాయని రైతులు చెప్పారు. గిట్టుబాటు ధర కోసం పోరాటం చేస్తామని శ్రీనివాసరావు రైతులకు హామీ ఇచ్చారు.

## కోర్టు ఆవరణలో ప్రచారం



కోర్టు ఆవరణలో ప్రచారం చేస్తున్న మన్నవ, డొక్కా, కోవెలమూడి


గుంటూరు, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కృష్ణ-గుంటూరు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఏపీటీఎస్ ఛైర్మన్ మన్నవ మోహనకృష్ణ, టీడీపీ నేతలు గుంటూరు జిల్లా కోర్టులో సోమవారం ప్రచారం చేశారు. న్యాయవాదులను కలిసి కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కు తొలి ప్రాధాన్య ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా మన్నవ మోహనకృష్ణ మాట్లాడుతూ గత ప్రభుత్వంలో అమాయకులపై పెట్టిన అక్రమ కేసుల నుంచి ఎంతోమంది అమాయకులని కాపాడిన లాయర్లకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజా సమస్యలపై శాసనమండలిలో తన గళాన్ని బలంగా వినిపించే నాయకుడు ఆలపాటి అన్నారు. రాష్ట్రం మరింత అభివృద్ధి చెందాలంటే కూటమి ప్రభుత్వానికి మద్దతు తెలపాలని కోరారు. కార్యక్రమంలో మాజీ మంత్రి డొక్కా మాణిక్యవరప్రసాద్, టీడీపీ జోన్-5 ఇన్‌చార్జి కోవెలమూడి రవీంద్ర, గుంటూరు లీగల్ సెల్ అధ్యక్షుడు చుక్కపల్లి రమేష్, ప్రముఖ న్యాయవాదులు పాల్గొన్నారు.

## జగన్ అండ్ కో డ్రామాలు చూసి జనం నవ్వుకుంటున్నారు

● ఎమ్మెల్యే గళ్ళా మాధవి

గుంటూరు, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోత): వైసీపీ అధినేత, ఎమ్మెల్యే జగన్ మోహన్‌రెడ్డి అండ్ కో అసెంబ్లీలో చేసిన డ్రామాను చూసి ప్రజలు నవ్వుకుంటున్నారని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి ఎద్దేవా చేశారు. సోమవారం శాసనసభా సమావేశాల అనంతరం ఆమె మాట్లాడుతూ అసెంబ్లీలో ప్రమాణ స్వీకారం తరువాత ఇటువైపు కన్నెత్తి చూడని జగన్‌రెడ్డి, అనర్హత వేటువేస్తారనే భయంతో అసెంబ్లీకి వచ్చి, గవర్నర్ ప్రసంగ సమయంలో తమ సభ్యులతో 'ప్రతిపక్ష హోదా ఇవ్వాలని' నినాదాలు చేయించి, వాక్ అవుట్ పేరుతో డ్రామాలు ఆడి బయటకి వెళ్ళిపోయి రాష్ట్ర ప్రజల్లో చులకనయ్యారన్నారు. నిలదీస్తాడు.. కడిగేస్తాడు అంటూ నిన్నటి నుంచి బ్లూమీడియా మొదలు, పేటీఎం బ్యాచ్ వరకు చెలరేగిపోతుంటే, జగన్ మాత్రం ఫొటోదిగి వెళ్లిపోయారని ఎద్దేవా చేశారు. ప్రతిపక్ష హోదా అనేది ప్రజలు, వ్యవస్థలు ఇవ్వాలి కానీ, డిమాండ్ చేస్తే రాదన్న విషయం జగన్ రెడ్డి తెలుసుకోవాలన్నారు. నలుగురు ఎమ్మెల్యేలను లాగేస్తే చంద్రబాబుకు ప్రతిపక్ష హోదా పోతుందంటూ జగన్ గతంలో చేసిన కామెంట్స్‌ను ఆయనకే తిరిగి గుర్తు చేస్తున్నామన్నారు.

## మెగా డీఎస్సీపై తొలి సంతకం: డేగల ప్రభాకర్



గుంటూరు, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): ఇచ్చినమాట ప్రకారం సచివాలయంలో ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన వెంటనే చంద్రబాబు టీచర్ పోస్టుల భర్తీ ఫైల్‌పై తొలి సంతకం చేశారని ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ డేగల ప్రభాకర్ అన్నారు. టీడీపీ గుంటూరు నగర కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టుల భర్తీకోసం ప్రభుత్వం మెగా డీఎస్సీ-25 నోటిఫికేషన్‌ను మార్చిలో విడుదల చేయనుందన్నారు. మొత్తం 16,347 ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఈ పోస్టుల ద్వారా ఎంపికైన అభ్యర్థులకు వచ్చే ఏడాది విద్యా సంవత్సరానికి పోస్టింగులు కూడా ఇవ్వనుందన్నారు. 2014-19 మధ్య 2 డీఎస్సీలు జరిపి 18వేల ఉపాధ్యాయ పోస్టులను భర్తీచేసింది టీడీపీ ప్రభుత్వమేనని గుర్తుచేశారు. చంద్రబాబునాయుడు 14 ఏళ్ల ముఖ్యమంత్రి హోదాలో 11 డీఎస్సీలు జరిపి లక్షా 50వేల పోస్టులు భర్తీ చేసి చరిత్ర సృష్టించారన్నారు. మెగా డీఎస్సీ ఇస్తానని యువతకు జగన్ రెడ్డి హామీ ఇచ్చి నిరుద్యోగులను వంచించాలని చూశారని, యువత ఆయనకు తగిన బుద్ధి చెప్పారన్నారు. టెట్, డీఎస్సీ కలిపి నోటిఫికేషన్ ఇచ్చి అభ్యర్థులను గందరగోళానికి గురిచేసిన ఘనుడు జగన్‌రెడ్డి అని విమర్శించారు.



ఆలపాటికి జాంబవ మహర్షి చిత్రపటాన్ని బహూకరిస్తున్న మాణిక్య వరప్రసాద్

## చట్టసభల్లో ఆలపాటి సేవలు ఎంతో అవసరం

మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్

గుంటూరు, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): ఆలపాటి రాజేంద్రప్రసాద్ సేవలు చట్టసభల్లో ఎంతో అవసరమని మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్ అన్నారు. రాజేంద్రనగర్‌లో మాణిక్యవరప్రసాద్ మిత్ర మండలి ఆధ్వర్యంలో ఆలపాటితో బ్రేక్‌ఫాస్ట్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వరప్రసాద్ మాట్లాడుతూ ఆలపాటి ఉపాధ్యాయులు, నిరుద్యోగులు, కార్మికులు, పట్టభద్రుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళతారని విశ్వాసం వ్యక్తం చేశారు. ఉమ్మడి కృష్ణ-గుంటూరు జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ ప్రభుత్వ ప్రైవేటురంగాలలో ఉన్న ఉద్యోగ ఖాళీలన్నింటినీ తాను ప్రభుత్వంతో మాట్లాడి భర్తీ చేయిస్తానని హామీనిచ్చారు. తన ప్రత్యర్థి గత జగన్ ప్రభుత్వం రాజధాని తరలిస్తుంటే, నిరుద్యోగులు, యువకులు, రైతులు, మహిళలు, విద్యార్థులపై లాఠీచార్జీ చేస్తుంటే ఆయన ఎక్కడున్నాడని పరోక్షంగా కేఎస్ లక్ష్మణరావుపై ప్రశ్నలు సంధించారు. గత ప్రభుత్వంలో డీఎస్సీ గురించి, ప్రభుత్వ ఉద్యోగులను మద్యంషాపులు, టాయిలెట్ల వద్ద ప్రభుత్వం నియమిస్తే ఆయన ఏనాడైనా ఈ సమస్యలపై మండలిలో మాట్లాడారా అని నిలదీశారు. ఈ సందర్భంగా డొక్కా మిత్ర మండలి ఆధ్వర్యంలో ఆలపాటికి ఆది జాంబవ మహర్షి చిత్రపటాన్ని బహూకరించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ రాయపాటి శ్రీనివాసరావు, జీఎంసీ ఫ్లోర్‌లీడర్ కోవెలమూడి నాని, తులసి సీడ్స్ ఛైర్మన్ రామచంద్రప్రభు, మాదిగ జనసేనసమితి నాయకులు చావలి బాలస్వామి, కాకుమాను పున్నారావు, కాపు నాయకులు మాదా రాధా, పి.వెంకట్, మేడిద బాబురావు, బీజేపీ నాయకులు కొండముడి భగవాన్‌దాస్, ఏసుదాసు, అత్తోట జోసఫ్, కట్టెపోగు ఉదయ్‌భాస్కర్, దాసరి జాన్‌బాబు, పినపాటి మోహన్‌రావు పాల్గొన్నారు.

## చట్టసభలంటే గౌరవముందా జగన్?

● జగన్‌కు ఎమ్మెల్యే నసీర్ సూటి ప్రశ్న

గుంటూరు, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): 'చట్టసభలపై గౌరవముందా? ప్రతిపక్ష హోదా అడిగితే ఇచ్చేదా? గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్, ఎమ్మెల్యే జగన్‌రెడ్డిని సూటిగా ప్రశ్నించారు. అసెంబ్లీ సమావేశాల అనంతరం సోమవారం ఆయన పత్రిక ప్రకటన విడుదల చేశారు. ప్రతిపక్ష హోదా అంటే ఏమిటో కూడా తెలియని జగన్ ఒక పార్టీకి అధ్యక్షుడు ఎలా అయ్యారో తెలియడం లేదంటూ ఎద్దేవా చేశారు. వైసీపీ నాయకుల తీరు చూస్తుంటే అసెంబ్లీ సమావేశాలకు అలా వచ్చామా? ఇలా వెళ్లామా? టీవీల్లో కనిపించామా? అన్నట్లు ఉందిగానీ, చట్టసభలపై గౌరవ ఉన్నట్లు కనిపించడం లేదని విమర్శించారు. ప్రజలు ఎందుకు మిమ్మల్ని తిరస్కరించారో అది తెలుసుకోకుండా ప్రతిపక్ష హోదా అడగడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ప్రజల పక్షాన ప్రశ్నించాలనుకుంటే అందుకు తగిన సమయం ఇచ్చేందుకు స్పీకర్ సిద్ధంగా ఉన్నారని, జగన్‌కు ఎప్పుడూ అధికారం ధ్యాసేగానీ ప్రజల బాగోగులు ఆలోచన లేదని నసీర్ విమర్శించారు. బాధ్యతగల శాసనసభ్యులైతే అసెంబ్లీలో హుందాగా వ్యవహరించే వారని, జగన్‌తోసహా వైసీపీ ఎమ్మెల్యేలంతా చౌకబారు ఆలోచనలతో ఉన్నారని ఆరోపించారు. ఇప్పటికైనా ప్రజల తరఫున పోరాడాలని, లేదంటే 11 సీట్లు కూడా దక్కవని హెచ్చరించారు.

## నగదు ప్రోత్సాహకాలకు దరఖాస్తుల ఆహ్వానం

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): పలు క్రీడలలో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా అందజేసే నగదు ప్రోత్సాహకాల్కై దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు జిల్లా క్రీడాభివృద్ధి అధికారి పి నరసింహారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. నగదు ప్రోత్సాహాలకు 15-24 మధ్య వయసుగల క్రీడాకారులు అర్హులన్నారు. ఫుట్‌బాల్, హాకీ, క్రికెట్ విభాగాల్లో బాలురు, టేబుల్ టెన్నిస్, బ్యాడ్మింటన్, అథ్లెటిక్స్, వెయిట్ లిఫ్టింగ్ విభాగాల్లో బాలురు, బాలికలు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అర్హులైన క్రీడాకారులు మార్చి 6వ తేదీ లోపు 'డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.ఎఫ్‌సీఐ.జీవోవీ.ఇన్' అనే వెబ్‌సైట్‌లో తమ వివరాలను నమోదు చేసుకోవాలని సూచించారు.

## నూతన భవన సముదాయానికి రూ 6లక్షల విరాళం

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): జేకేసీ కళాశాల రోడ్డులో కమ్మజన సేవాసమితి ఆధ్వర్యంలో నూతనంగా నిర్మిస్తున్న వసతి భవనసముదాయంలో ఒక గదికి అయ్యే ఖర్చు రూ 6లక్షలను ప్రవాసాంధ్రులు డాక్టర్ రావిపాటి నారాయణ ప్రసాదు, కోటేశ్వరరావు ప్రకటించారు. సోమవారం బృందావన్‌గార్డెన్స్, కుందులరోడ్డులోని కమ్మ బాలికల వసతిగృహంలో సమితి కార్యదర్శి చుక్కపల్లి రమేష్‌కు ఆర్‌వీఆర్‌జేసీ కాలేజీ అసోసియేట్ ప్రొఫెసర్ కే లక్ష్మీనారాయణ ఈ చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా చుక్కపల్లి రమేష్ మాట్లాడుతూ త్వరలోనే భవననిర్మాణాన్ని పూర్తి చేసి అందుబాటులోకి తెస్తామన్నారు. కార్యక్రమంలో సమితి ఉపాధ్యక్షుడు వడ్లమూడి నాగేంద్రం, పాలకవర్గ సభ్యుడు పెద్ది సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

## కార్మిక సంక్షేమ బోర్డును పునరుద్ధరించండి

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): జగన్ ప్రభుత్వం నిర్వీర్యం చేసిన కార్మిక సంక్షేమబోర్డును పునరుద్ధరించాలని భవననిర్మాణ కార్మికసంఘం (ఏఐటీయూసీ) రాష్ట్ర అధ్యక్షుడు పుప్పాల సత్యనారాయణ డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ వద్ద కార్మికులు చేపట్టిన నిరసనల్లో ఆయన ప్రసంగించారు. ప్రభుత్వం ఏర్పడి 8నెలలు గడిచినా ఇంతవరకు సంక్షేమబోర్డు ప్రకటించకపోవడం బాధాకరమన్నారు. కూటమి ప్రభుత్వం స్పందించి సంక్షేమబోర్డుకు నిధులు కేటాయించి, పెండింగ్‌లో ఉన్న 46 వేల క్లెయిమ్‌లను పరిష్కరించాలని కోరారు. నిరసనల్లో ఏఐటీయూసీ నాయకులు అరుణ్‌కుమార్, హనుమంతరావు, అంజిబాబు, రామారావు, వీరాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## క్వారీ తిరునాళ్ళకు వాహనాల దారిమళ్ళింపు : ఎస్పీ

గుంటూరు, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి సందర్భంగా వడ్లమూడి క్వారీ తిరునాళ్ళకు వాహన రాకపోకలను దారి మళ్ళించినట్లు ఎస్పీ సతీష్‌కుమార్ తెలిపారు. వాహనచోదకులు నిబంధనలు పాటించి పోలీసులకు సహకరించాలన్నారు. గుంటూరు నుండి తెనాలి వైపు వెళ్ళు వాహనాలు బుడంపాడు అండర్‌పాస్ నుండి తక్కెళ్ళపాడు- నందివెలుగు మీదుగా వెళ్లాలని, తిరిగి అదేదారిలో గుంటూరు రావాలని సూచించారు. గుంటూరు నుండి పొన్నూరు వైపు వెళ్ళు వాహనాలు బుడంపాడు అండర్‌పాస్ నుండి ఏటుకూరు బైపాస్ ప్రత్తిపాడు- పెదనందిపాడు-కాకుమాను మీదుగా పొన్నూరు వెళ్లాలని, మళ్ళీ తిరిగి అదేదారిలో రావాలన్నారు. గుంటూరు నుండి క్వారీ తిరునాళ్ళకు వెళ్ళే వాహనాలు నారాకోడూరు మినీబైపాస్ మీదుగా తిరునాళ్ళ వద్దకు చేరుకోవాలని, తిరిగి వెళ్ళు వాహనాలు వేజెండ్ల అడ్డరోడ్డుకు ఎదురుగా ఉన్న రోడ్డు నుండి చేబ్రోలు చేరుకుని రెడ్డిపాలెం-లేమల్లెపాడు - ఏటుకూరు మీదుగా గుంటూరు చేరుకోవాలని సూచించారు. ఈ ఆంక్షలు ఈ నెల 26న మధ్యాహ్నం నుంచి 27 ఉదయం 8 గంటల వరకు అమలులో ఉంటాయన్నారు. తెనాలి నుంచి తిరునాళ్ళకు వచ్చే వాహనాలు వడ్లమూడి అడ్డరోడ్డు, వడ్లమూడి గ్రామం నుండి తిరునాళ్ళకు చేరుకోవాలన్నారు. తిరిగి తెనాలి వెళ్ళే వాహనాలు తెనాలి ప్రధాన రహదారిలో వెళ్ళాలన్నారు. పొన్నూరు నుంచి తిరునాళ్ళకు వచ్చే వాహనాలు చేబ్రోలు నుండి వడ్లమూడి వెళ్ళేమార్గం ద్వారా తిరునాళ్ళకు చేరుకోవాలని, తిరిగి అదే దారిలో వెళ్ళిపోవాలన్నారు. భక్తులు పోలీసుల సూచనలు పాటించి ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా సహకరించాలని కోరారు.

## సింహాద్రి శివారెడ్డి పోరాటాలు స్ఫూర్తిదాయకం

● సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వీ శ్రీనివాసరావు

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): బడుగు, బలహీన వర్గాల హక్కులకోసం సింహాద్రి శివారెడ్డి చేసిన పోరాటాలు స్ఫూర్తిదాయకమని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వీ శ్రీనివాసరావు అన్నారు. స్థానిక బ్రాడీపేట, సీపీఎం జిల్లా కార్యాలయంలో సోమవారం శివారెడ్డి వర్ధంతి సభలో ఆయన మాట్లాడుతూ శివారెడ్డి తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో కీలక పాత్ర పోషించారని గుర్తుచేశారు. మంగళగిరి నియోజకవర్గంలో పేదలకు ఇళ్ళస్థలాలు, ఇళ్ళపట్టాల కోసం ఆయన అనేక పోరాటాలు చేశారన్నారు. జిల్లా కార్యదర్శి వై నేతాజీ మాట్లాడుతూ పేదల సమస్యల పరిష్కారానికి ప్రజా ఉద్యమాలు నిర్మించడమే శివారెడ్డికిచ్చే నిజమైన నివాళి అన్నారు. కార్యక్రమంలోప్రభాకర్‌రెడ్డి, కేశవరావు, సూర్యారావు తదితరులు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్‌సరఫరా ఉండని ప్రాంతాలు

గుంటూరు, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): విద్యుత్‌లైన్‌ల నిర్వహణలో భాగంగా మంగళవారం పలు ప్రాంతాల్లో విద్యుత్‌సరఫరా నిలిపివేయనున్నట్లు గుంటూరు టౌన్-2 డిప్యూటీ ఈఈ ఎన్ గురవయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్‌వీఎన్ కాలనీ, ఉద్యోగనగర్, నేతాజీనగర్, వైష్ణవినగర్, తారకరామనగర్ ప్రాంతాల్లో ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు. అలానే కృష్ణనగర్, కుందులరోడ్డు ప్రాంతాల్లో మంగళవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 వరకు విద్యుత్‌సరఫరా నిలిపివేయనున్నట్లు చెప్పారు. విద్యుత్ అంతరాయానికి ప్రజలు సహకరించాలని కోరారు.

## మౌలిక సదుపాయాల కల్పనకే తొలి ప్రాధాన్యం

● కార్పొరేటర్ కరుణకుమారి

గుంటూరు, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): వెనుకబడిన ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పనకే తొలి ప్రాధాన్యం కల్పిస్తున్నట్లు 25వ డివిజన్ కార్పొరేటర్ చంద్రగిరి కరుణకుమారి తెలిపారు. సోమవారం డివిజన్ పరిధిలోని మిర్చియార్డు సమీపంలోని ఆదర్శనగర్‌లో పర్యటించిన ఆమె మెటల్ రోడ్డు నిర్మాణపనులను పరిశీలించారు. ఆదర్శనగర్‌లోని టవర్ నుంచి మిర్చియార్డు పడమర వైపున రోడ్డుకు కనెక్టివిటీ మెటల్ రోడ్డు పనులను పరిశీలించిన ఆమె త్వరితగతిన పూర్తిచేయాలని కోరారు. అలానే తాగునీరు, రహదారులు, కాల్వలు, వీధి లైట్లు కల్పించటంలో ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నామన్నారు. కార్యక్రమంలో సత్యనారాయణరెడ్డి, ఓర్సు కొండలు, వెంకటేశ్వరరెడ్డి, రాఘవమ్మ పలువురు నాయకులున్నారు.


## వైసీపీ సోషల్ మీడియా సైకోపై కేసు నమోదు

గుంటూరు, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): గుంటూరు నగరానికి చెందిన వైసీపీ సైకో అవుతు శ్రీధర్‌రెడ్డి మళ్ళీ రెచ్చిపోయారు. సోషల్ మీడియా లో ముఖ్యమంత్రి చంద్రబాబుపై మరోసారి అనుచిత వ్యాఖ్యలు చేశారు. గతంలో వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు కూడా జడ్జిలతో పాటు అనేకమందిపై సోషల్‌మీడియాలో దారుణంగా పోస్టులు పెట్టారు. దీనిపై అప్పట్లో హైకోర్టు ఆగ్రహం వ్యక్తంచేసిన విషయం విదితమే. కోర్టు ఆదేశాలతో పలువురిపై పోలీసులు కేసులు నమోదు చేశారు. తాజాగా శ్రీధర్‌రెడ్డి మరోసారి సీఎం చంద్రబాబుపై అసభ్యకర పోస్టుల తో రెచ్చిపోయారు. దీంతో శ్రీధర్‌రెడ్డిపై విజయవాడలోని సూర్యారావు పేట పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. కొరిటెపాడులో ఉండే శ్రీధర్‌రెడ్డి విషయం తెలుసుకుని అజ్ఞాతంలోకి వెళ్ళిపోయారు. శ్రీధర్‌రెడ్డి కోసం పోలీసులు గాలిస్తున్నారు.

## వీఆర్‌ఎస్‌కు ఇద్దరు ఎంపీడీవోల దరఖాస్తు

గుంటూరు సిటీ, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లాలో పని చేస్తున్న ఇరువురు ఎంపీడీఓలు వీఆర్‌ఎస్‌కు(స్వచ్ఛంద ఉద్యోగ విరమణ) దరఖాస్తు చేసుకున్నారు. ఫిరంగిపురం ఎంపీడీఓ ఎస్ వెంకటేశ్వరరావు, వట్టిచెరుకూరు ఎంపీడీఓ ఎం రమేష్‌బాబు వీఆర్‌ఎస్‌కు దరఖాస్తు చేసుకున్న వారిలో ఉన్నారు. మే 31 నాటికి వీరు వీఆర్‌ఎస్ కింద ఉద్యోగవిరమణ చేయనున్నారు. వెంకటేశ్వరరావుకు ఈ ఏడాది నవంబర్ నెలాఖరు వరకు సర్వీసు ఉండగా ఆరు నెలలు ముందుగా, రమేష్‌బాబుకు వచ్చే ఏడాది ఏప్రిల్ చివరివరకు సర్వీసు ఉండగా సంవత్సరం ముందుగా ఉద్యోగ విరమణకు సిద్ధపడ్డారు. ఆరోగ్య పరిస్థితి, వయస్సు రీత్యా ఈ ఇరువురు ఎంపీడీఓలు వీఆర్‌ఎస్‌కు దరఖాస్తు చేసుకున్నట్లు తెలుస్తోంది.

## పెట్రోల్ బంకులపై విజిలెన్స్ దాడులు



గుంటూరులోని పెట్రోల్ బంకులో తనిఖీలు నిర్వహిస్తున్న విజిలెన్స్ అధికారులు

గుంటూరు సిటీ, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లాలోని పెట్రోల్ బంకులపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు విస్తృతంగా దాడులు నిర్వహించారు. రాష్ట్ర అధికారుల ఆదేశాలతో ఈ దాడులు నిర్వహించినట్లు తెలుస్తోంది. విజిలెన్స్ ఎస్పీ దువ్వారపు సూర్యశ్రావణ్‌కుమార్ నేతృత్వంలో ఉమ్మడి జిల్లాలోని పలు పెట్రోల్ బంకులపై దాడులు జరిగాయి. తూనికలు, కొలతలు, బంకుల నిర్వహణలో ప్రభుత్వ ఆదేశాలు అమలుచేస్తున్న తీరును అధికారులు పరిశీలించారు. కొన్ని పెట్రోల్‌బంకులపై నివేదికను రాష్ట్ర అధికారులకు పంపినట్లు తెలుస్తోంది. దాడుల్లో విజిలెన్స్ సీఐలు కొమ్మాలపాటి చంద్రశేఖర్, పి.శివాజీ, ఏఓ ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో చండీహోమం ప్రారంభం

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో భారతీధార్మిక విజ్ఞాన పరిషత్ ఆధ్వర్యంలో మహాశివరాత్రి సందర్భంగా సోమవారం చండీహోమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.



రేపల్లె: టెన్నిస్‌క్లబ్ రోడ్డులో డ్రైనేజీలో తాగునీటి పైపులు





గుంటూరు: పాల ఆస్పత్రి, బొంగరాలబీడులో మురుగు కాలువలో నుంచి వెళుతున్న మంచినీటి పైపులు



గుంటూరు: చౌత్రా, కన్నావారి తోటలో మురుగు కాలువలో నుంచి వెళుతున్న మంచినీటి పైపులు

# గులియన్ గుబులు

- కలుషిత నీరు, ఆహారంతోనే జీబీఎస్ వ్యాప్తి
- పట్టణాల్లో ప్రమాద ఘంటికలు
- పట్టించుకోకుంటే పరిస్థితి విషమం

గులియన్ గుబులు ప్రజలను వెంటాడుతోంది.. ప్రస్తుతం ఎవరి నోట విన్నా గులియన్ బారే సిండ్రోమ్ గురించే. బాధితుల రక్తం, మూత్రం, లాలాజలం పరీక్షించిన వైద్య నిపుణులు కలుషిత ఆహారం, నీరు, పారిశుధ్య లోపమే ప్రధాన కారణాలుగా చెబుతున్నారు. ఇప్పటికే గుంటూరు జీజీహెచ్‌లో 13 మంది ఈ వ్యాధితో చేరగా, ఇద్దరు మరణించగా, ఆరుగురు చికిత్స పొంది డిశ్చార్జ్ అవ్వగా, మరో ఐదుగురు చికిత్స పొందుతున్నారు. వచ్చేది వేసవి కాలం కావడంతో తాగేనీరు, బయట తినే ఆహార పదార్థాల విషయంలో శుభ్రత పాటించాలని డాక్టర్లు సూచిస్తున్నారు. అయితే అధికారులు మాత్రం దీనికి సంబంధించి ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. ఆహార తనిఖీలపై దృష్టి సారించడం లేదు. మున్సిపాలిటీల్లో కూడా చాలా చోట్ల తాగునీటి పైపులైన్లు మురుగు కాలువ ల్లోనే ఉన్నాయి. గతంలో కూడా గుంటూరులో కలుషిత నీటి సరఫరా కారణంగా చాలా మంది డయేరియాతో మృతి చెందిన విషయం విధితమే. అంతేకాకుండా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీలు దాదాపు శూన్యం అని చెప్పవచ్చు. ప్రస్తుతం 'గులియన్' నేపథ్యంలోనైనా అధికారులు స్పందించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది.

-గుంటూరు, ఆంధ్రజ్యోతి



రేపల్లె: రైల్వేస్టేషన్ పక్కరోడ్డులో మురుగు కాల్వలో నానుతున్న తాగునీటి పైపులు



బాపట్ల: మూడోవార్డు రాజీవ్‌గాంధీకాలనీలో డ్రైనేజీలో గుండా తాగునీటి ట్యాప్ కనెక్షన్ కోసం ఏర్పాటు చేసిన పైపు



పొన్నూరు: మురుగు కాలువలో ఉన్న పాత పొన్నూరుకు వెళ్లే ప్రధాన వాటర్ పైప్‌లైన్



పొన్నూరు: మురుగు కాలువలో నుంచి వెళ్తున్న శ్రీనగర్ కాలనీకి వెళ్లే ప్రధాన పైప్‌లైన్



# సీఎం చొరవ.. మిర్చి ధరల్లో కదలిక

- క్వింటాల్‌కు రూ. 1000కి పైగా పెరిగిన వైనం
- హర్షం వ్యక్తం చేస్తున్న రైతాంగం

గుంటూరు, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): మిర్చి ధరలు క్రమేపి పెరుగుతున్నాయి. గత వారం క్వింటాల్‌కు రూ. వెయ్యి వరకు పెరిగిన వివిధ రకాల మిరపకాయల రేట్లు, మూడు రోజుల క్రితం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మిర్చి రైతులు, వ్యాపారులు, ఉన్నత స్థాయి అధికారులతో మిర్చి ధరల పెంపుపై నిర్వహించిన సమీక్ష దృష్ట్యా ఈ సోమవారం నుంచి మరో రూ. వెయ్యి వరకు ధరలు పెరిగాయి. మిర్చికి కేంద్రం కనీస మద్దతు ధర రూ. 11,781గా నిర్ణయించింది. మార్కెట్ ఇంటర్‌వెన్షన్ స్కీమ్ ద్వారా కేంద్రం 2.58 లక్షల మెట్రిక్‌టన్నుల మిర్చి సేకరణకు అవకాశం కల్పించింది. తాము కొనుగోలు చేయకపోతే ప్రభుత్వం మిర్చిని సేకరించనుండటంతో వ్యాపారస్తులు కొనుగోళ్లకు ఉపక్రమించారు. దీంతో పోటీ పెరిగి ధర పెరగడం ప్రారంభమయ్యింది. సీఎం సమీక్ష సమావేశం అనంతరం మిర్చి ధరల్లో పెరుగుదల కనిపించడంతో రైతాంగం హర్షం వ్యక్తం చేస్తున్నది.

గుంటూరు మిర్చియార్డులో ప్రధానంగా 334, నంబరు. 5, 273, 341, 4884, సూపర్ 10, తేజ, షార్క్-1, బ్యాడిగి 355, సింజెంటా బ్యాడిగి 5531, ఎన్ 250 బుల్లెట్, దేవనూరు డీలక్స్, ఆర్మూరు వెరైటీల మిర్చి విక్రయాలు జరుగుతుంటాయి.

పది రోజుల క్రితం వరకు కూడా మిర్చి క్వింటాల్ ధర రూ. 11 వేల నుంచి రూ. 12 వేల మధ్యనే కొనసాగింది. సీఎం చంద్రబాబు సమీక్ష అనంతరం సోమవారం 341 వెరైటీకి రూ. 14,500 గరిష్ఠ ధర లభించింది. తేజకు రూ. 14,200 పెట్టి ఎగుమతిదారులు కొనుగోలు చేశారు. 334ని రూ. 13500, నంబరు. 5ని రూ. 13,200, 272ని రూ. 13 వేలు, 4884ని రూ. 13500, షార్క్-1ని రూ. 12,500, బ్యాడిగి 355ని రూ. 13500, సింజెంటా బ్యాడిగి 5531ని రూ. 12 వేలు, ఎన్ 250 బుల్లెట్‌ని రూ. 13 వేలు, దేవనూరు డీలక్స్‌ని రూ. 13500, ఆర్మూరు వెరైటీని రూ. 11500 పెట్టి రైతుల వద్ద ఎగుమతిదారులు కొనుగోలు చేశారు. ఈ సంవత్సరం మిర్చి దిగుబడి కూడా తక్కువగా ఉండడంతో ధర మరింత పెరిగే అవకాశం ఉందని వ్యాపార వర్గాలు తెలిపాయి.



# నిఘా నీడలో.. ఇంటర్ పరీక్షలు

(5వ పేజీ తరువాయి)

పత్రాల బండిల్స్ ప్యాక్ చేసేలా ఏర్పాట్లు చేశారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్‌అమల్లో ఉంటుందని, పరీక్షలు జరిగే సమయంలో కేంద్రాల సమీపంలోని జిరాక్స్ సెంటర్స్ మూసివేయాలని ఆదేశాలు జారీ చేసినట్లు ఆర్‌ఐఓ వివరించారు. ఈనెల 24న ప్రశ్నాపత్రాల కోసం 16 స్టోరేజ్ కేంద్రాలకు(పోలీసు స్టేషన్స్) అత్యంత భద్రత నడుమ పంపిణీ చేశారు. పరీక్షల పర్యవేక్షణ కోసం 83 మంది, చీఫ్ సూపరింటెండెంట్లు, మరో 83 మంది డిపార్టుమెంట్ ఆఫీసర్లను ప్రభుత్వం నియమించినట్లు ఇంటర్ బోర్డు ఆర్‌ఐఓ జుబేర్ వెల్లడించారు.

## విద్యార్థుల సౌలభ్యం కోసం సంస్కరణలు

ఇంటర్ బోర్డు చరిత్రలో తొలిసారి హాజరుతో పనిలేకుండా ఫీజు కట్టిన ప్రతి విద్యార్థి పరీక్షలకు హాజరయ్యేలా ఏర్పాట్లు చేశారు. అంతేకాదు విద్యార్థుల సౌలభ్యం కోసం హాల్ టిక్కెట్లు వాట్సప్‌వెబ్(9552300009) నుంచి డౌన్‌లోడు చేసుకుని ప్రిన్సిపల్ సంతకంతో పనిలేకుండా నేరుగా పరీక్షకు హాజరు అయ్యేలా ఏర్పాట్లు చేశారు. పరీక్షలపై సందేహాలు, ఫిర్యాదుల చేసేందుకు ఇంటర్ బోర్డు కార్యాలయంలో ప్రత్యేకసెల్ (0863-2228528) ఏర్పాటు చేశారు. ఇలా కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు నడుమ ప్రశాంత వాతావరణంలో పరీక్ష నిర్వహణకు ప్రణాళికలు ఇంటర్ బోర్డు అధికారులు సిద్ధం చేశారు.

- పరీక్షల కోసం ఏర్పాటు చేసిన కేంద్రాలు : 81
- ప్రథమ సంవత్సరం విద్యార్థులు : 34,273
- ద్వితీయ సంవత్సరం విద్యార్థులు : 34,973
- సీఎస్,డీవోలు : 166
- సిట్టింగ్,ఫ్లయింగ్ స్క్వాడ్స్ : 8
- స్టోరేజ్ కేంద్రాలు :16
- సీసీ కెమెరాలు: దాదాపు 400 పైగా



స్టోరేజ్ కేంద్రం వద్ద భద్రత


# కోటప్పకొండలో... భక్తుల సందడి

- ప్రారంభమైన తిరునాళ్ల ఉత్సవాలు
- త్రికోటేశ్వరునికి విశేష అభిషేకాలు
- కొండకు తరలి వచ్చిన ప్రభలు

కోటప్పకొండ(నరసరావుపేట) ఫిబ్రవరి 24 : కోటప్పకొండ శ్రీ త్రికోటేశ్వర స్వామి సన్నిధిలో ఏకాదశి పండుగను పురస్కరించుకొని భక్తుల రద్దీ నెలకొంది. తెల్లవారు జాము నుంచే వేలాదిగా భక్తులు కోటప్పకొండకు తరలి వచ్చి కోటయ్య స్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు, విశేష ద్రవ్యాలతో స్వామికి అభిషేకాలు చేశారు. మహాశివరాత్రి రోజున శ్రీ త్రికోటేశ్వర స్వామి సన్నిధిలో జరిగే తిరునాళ్ల మహోత్సవాలు సోమవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. మొక్కుబడి ప్రభలతో భక్తులు కొండకు తరలి వచ్చారు. అధికారులు శీఘ్ర దర్శనం, ఉచిత దర్శనం, ప్రత్యేక దర్శనం క్యూలైన్‌లను ఏర్పాటు చేశారు. ఉచిత దర్శనం క్యూలైన్‌లో భక్తుల రద్దీ నెలకుంది. అధిక సంఖ్యలో భక్తులు అభిషేక మండపంలో ప్రత్యేక అభిషేకాలు చేశారు. చిట్టి పొట్టి ప్రభలు కొండ దిగువున కొలువు దీరాయి. నరసరావుపేట పురపాలక సంఘం ప్రభ కోటప్పకొండకు చేరుకుంది. ఆలయ ఈవో డీ చంద్రశేఖరరావు దేవస్థానం వద్ద ఏర్పాట్లను పర్యవేక్షించారు. నరసరావుపేటకు చెందిన శ్రీ షిరిడీ సాయి అన్నపూర్ణ అన్నదాన కమిటీ, ఆర్యవైశ్య సంఘం, వివిధ సేవా సంస్థల ఆధ్వర్యం లో అల్పాహారం, పులిహోర, మజ్జిగ, మంచి నీటి ప్యాకెట్లను పంపిణీ చేశారు. గిరి ప్రదక్షిణ సేవా సమితి ఆధ్వర్యంలో కొండ దిగువున భక్తులకు అన్న ప్రసాద వితరణ చేశారు.

## ఘాట్ రోడ్డులో నడకకు అనుమతి లేదు

భక్తులు సోపాన మార్గంతో పాటు ఘాట్ రోడ్డులో కూడా నడకతో కొండపైకి చేరుకుంటున్నారు. దీనివలన వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. ఈ నేపథ్యంలో ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా ఈ సారి తిరునాళ్ల రోజున ఘాట్ రోడ్డులో భక్తులకు అనుమతి లేదని ఎస్పీ కంచి శ్రీనివాసరావు ప్రకటించారు. ఘాట్ రోడ్డులో నడకకు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు అనుమతించమని చెప్పారు. భక్తులు సోపాన మార్గం గుండా కొండపైకి రావాలని కోరారు.



శ్రీ త్రికోటేశ్వర స్వామికి విశేష అలంకారం



అభిషేక మండపంలో శ్రీ త్రికోటేశ్వర స్వామికి అభిషేకం



విద్యుత్ దీపాలతో కాంతులీనుతున్న కావూరి ప్రభ

## ప్రభల కోసం 8 నుంచి 4 గంటల వరకు విద్యుత్ నిలిపివేత

తిరునాళ్లకు వచ్చే ప్రభల కోసం చిలకలూరిపేట రోడ్డులో యూటీ వద్ద ఉన్న హైటెన్షన్ లైన్‌కు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని, ఆ శాఖ ఈఈ రాంబొట్లు తెలిపారు. తిరునాళ్ల రోజున బుధవారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని చెప్పారు. అలాగే తిరునాళ్ల మరుసటి రోజు గురువారం ప్రభలు తిరిగి గ్రామాలకు తరలించేందుకు ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని చెప్పారు. భారీ విద్యుత్ ప్రభల నిర్వాహకులు ఆయా సమయాల్లో ప్రభలను తరలించాలని సూచించారు.



కొండ దిగువున ఏర్పాటు చేసిన ఎమ్యూజ్‌మెంట్ పార్క్

## కోటప్పకొండ తిరునాళ్లలో ట్రాఫిక్ నిబంధనలు ఇలా..

కోటప్పకొండ తిరునాళ్లలో యాత్రికుల సౌకర్యార్థం పోలీసులు అమలు చేస్తున్న ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని పల్నాడు జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు కోరారు.

- నరసరావుపేట వైపు నుండి కోటప్పకొండకు వచ్చే భక్తులు ఆర్టీసీ బస్సుల్లో.. వీఐపీలు ముందుగా అనుమతి పొందిన వాహనాలలో ఉప్పలపాడు, పెట్లూరివారి పాలెం గ్రామం ఘాట్ రోడ్డు పక్కన కేటాయించిన వీఐపీ పార్కింగ్ ప్రదేశమునకు చేరుకుని, క్రమ పద్ధతిలో వాహనాలను పార్కింగ్ చేసుకుని ప్రభుత్వం ఏర్పాటు చేసిన బస్సులలో వీఐపీలు కొండపైకి చేరుకోవాలి. తిరుగు ప్రయాణంలో పార్కింగ్ వెనుక వైపు ఏర్పాటు చేయబడిన మట్టి రోడ్డు నుంచి కొండకావూరు, పమిడిమర్రు మీదుగా పమిడిమర్రు రోడ్డును చేరి జేఎన్‌టీయూ కాలేజీ మీదుగా నరసరావుపేట, వినుకొండ హైవే పైకి చేరుకొని తిరిగి వెళ్ళవలసి ఉంటుంది.
- నరసరావుపేట నుండి కోటప్పకొండకు వచ్చే ప్రభలు మధ్యాహ్నం 12 గంటలకు బయలుదేరి యల్లమంద, గురువాయపాలెం గ్రామాల మీదుగా సాయంత్రం 4 గంటలకు ప్రభల నిధి వద్దకు చేరుకోవాలి. ఆ తరువాత అనుమతించరు.
- సంతమాగులూరు, అద్దంకి మండలాల నుంచి వచ్చే భక్తులు మిన్నెకల్లు నుంచి లక్ష్మీపురం వద్ద వాహనాలు పార్కింగ్ చేసుకొని పెట్లూరి వారి పాలెం మీదుగా ఘాట్ రోడ్డు పక్కన గల జనరల్ పార్కింగ్ కు వెళ్లవలెను. మిన్నేకల్లు నుండి కోటప్పకొండ వైపు వాహనాలు అనుమతించరు.
- సంతమాగులూరు, అద్దంకి మండలాల నుంచి వచ్చే ప్రభలు మిన్నెకల్లు తంగేడుమల్లి, గురిజేపల్లి, యూటీ గ్రామాల మీదుగా ప్రభల నిధికి చేరుకోవాలి. మిన్నెకల్లు నుండి కోటప్పకొండ వైపు ట్రాఫిక్ అనుమతించరు.
- చిలకలూరిపేట నుంచి వచ్చే భక్తులు పురుషోత్తపట్నం, యడవల్లి, యూటీ సెంటర్ నుంచి క్వారీ (క్రషర్) మార్గం గుండా వచ్చి వీఐపీ పార్కింగ్ నందు వాహనాలను పార్కింగ్ చేసుకోవాలి. తిరుగు ప్రయాణంలో క్రషర్ రోడ్డు మీదుగా యూటీ జంక్షన్ ను చేరి యక్కలవారిపాలెం, కమ్మవారిపాలెం మీదుగా చెరువు రోడ్డు చేరి చిలకలూరిపేట వెళ్ళాలి.
- చిలకలూరిపేట నుండి వెళ్ళు ప్రభలు పురుషోత్తపట్నం, యడవల్లి మీదుగా యూటీ జంక్షన్ చేరి నిధి దారి గుండా ప్రభల స్టాండు కు చేరాలి.
- చిలకలూరిపేట నుంచి వచ్చే ట్రాక్టర్లు పురుషోత్తపట్నం, యడవల్లి, అట్టల ఫ్యాక్టరీ రోడ్ నుంచి కట్టుబడివారిపాలెం మీదుగా ప్రభల స్టాండ్ కు చేరాలి.
- ఏఎం రెడ్డి కాలేజీ ఎదురుగా గల పోలీసు చెక్‌పోస్టు నుంచి కోటప్పకొండ వైపు వాహనాలకు అనుమతి లేదు.
- యలమంద, గురువాయపాలెం వైపు నుంచి వచ్చే భక్తులు బాతింగ్ ఘాట్ వద్ద ఏర్పాటు చేసిన ఐరన్ బ్రిడ్జ్ ను చేరి, యాదవ సత్రంనకు వెనుక గల పార్కింగ్ ప్రదేశం నందు వాహనాలను పార్కు చేసుకోవాలి.
- రెడ్ల సత్రం, యాదవ సత్రాల వైపు నుంచి నరసరావుపేటకి వెళ్ళు వాహనాలు, చిలకలూరిపేట మేజర్ కెనాల్ మీద ఏర్పాటు చేసిన రూట్ లో మాత్రమే వెళ్లి ఏఎం కాలేజి వద్ద నరసరావుపేట బైపాస్ కు వెళ్లవలను. గురవాయపాలెం, యల్లమంద మీదుగా నరసరావుపేట వైపుకు వెళ్ళుటకు ఎటువంటి వాహనములు అనుమతించరు.
- శ్రీ త్రికోటేశ్వర స్వామి దర్శనానికి వచ్చే భక్తులు మీకు అందుబాటులో ఉన్న పార్కింగ్ ప్రదేశాన్ని ఎంచుకుని అక్కడ మీ వాహనాలను పార్కింగ్ చేసుకోవాలి.

## పశ్చిమ డెల్టా కాల్వకు 1016 క్యూసెక్కుల నీరు

దుగ్గిరాల, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): ప్రకాశం బ్యారేజి నుంచి పశ్చిమ డెల్టా కాల్వకు 1016 క్యూసెక్కుల సాగునీటిని సోమవారం విడుదల చేసినట్లు నీటి పారుదలశాఖ అధికారులు తెలిపారు. బ్యారేజి వద్ద 12.0 అడుగుల నీటిమట్టం ఉండగా, దుగ్గిరాల సబ్‌డివిజన్ నుంచి రేపల్లెకాల్వకు 110, తూర్పుకాల్వకు 226, పశ్చిమకాల్వకు 180, నిజాంపట్నంకాల్వకు 100, కొమ్మమూరు కాల్వకు 376 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు.

## 40 బస్తాల పసుపు విక్రయం

దుగ్గిరాల పసుపు మార్కెట్ యార్డులో సోమవారం జరిగిన వేలంలో 40 బస్తాల పసుపును రైతులు వ్యాపారులకు విక్రయించారు. కొమ్ములు క్వింటాల్‌కు కనిష్ఠధర రూ.8,500, గరిష్ఠధర రూ.11,001, మోడల్‌ధర రూ.11,001 పలికాయి. కాయ క్వింటాల్‌కు కనిష్ఠధర రూ.8,500, గరిష్ఠధర రూ.8,500 మోడల్‌ధర రూ.8,500 పలికాయి.

## వీఆర్ఎస్‌కు ఇద్దరు ఎంపీడీవోల దరఖాస్తు

గుంటూరు సిటీ, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లాలో పని చేస్తున్న ఇద్దరు ఎంపీడీవోలు వీఆర్ఎస్ (స్వచ్ఛంద ఉద్యోగ విరమణ)కు దరఖాస్తు చేసుకున్నారు. ఫిరంగిపురం ఎంపీడీవోగా పనిచేస్తున్న ఎన్ వెంకటేశ్వరరావు, వట్టిచెరుకూరు ఎంపీడీవో ఎం రమేష్‌బాబు వీఆర్ఎస్‌కు దరఖాస్తు చేసుకున్న వారిలో ఉన్నారు. మే 31 నాటికి ఈ ఇద్దరు ఎంపీడీవోలు వీఆర్ఎస్ కింద ఉద్యోగ విరమణ చేయనున్నారు. వెంకటేశ్వరరావు ఈ ఏడాది నవంబరు నెలాఖరు వరకు సర్వీసు ఉండగా ఆరు నెలలు ముందుగానే ఉద్యోగ విరమణ చేయనున్నారు. రమేష్ బాబుకు వచ్చే ఏడాది ఏప్రిల్ చివర వరకు సర్వీసు ఉండగా, సంవత్సరం ముందుగానే ఉద్యోగ విరమణకు సిద్ధపడ్డారు. ఆరోగ్య పరిస్థితి, వయస్సు రీత్యా ఈ ఇద్దరు వీఆర్ఎస్‌కు దరఖాస్తు చేసుకున్నట్లు తెలుస్తోంది.



మంగళగిరి ఆటోనగర్‌లోని ఏపీఎంఎస్ఐడీసీ కార్యాలయంలో చైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావును బీజేపీ రాష్ట్ర మీడియా ఇన్‌చార్జి పాతూరి నాగభూషణం సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. కూటమి ప్రభుత్వంలో అమలవుతున్న వైద్య, ఆరోగ్య సదుపాయాల కల్పనకు సంబంధించి పలు అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించారు. **- మంగళగిరి**

## పోలింగ్ కేంద్రాల పరిశీలన




పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కమిషనర్ బాషా

మంగళగిరి సిటీ, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి పోలింగ్ కేంద్రాలను ఎంటీఎంసీ కమిషనర్ అలీం బాషా సోమవారం పరిశీలించారు ఎంటీఎంసీ పరిధిలోని పలు పోలింగ్ కేంద్రాలను సందర్శించి సిబ్బందికి సూచనలు చేశారు. పోలింగ్ కేంద్రాల్లో అన్ని మౌలిక వసతులు కల్పించాలని, ఎన్నికల విధుల్లో అలసత్వం వహించవద్దని సూచించారు. కమిషనర్ వెంట ఎంటీఎంసీ డిప్యూటీ కమిషనర్, ఇంజనీరింగ్ అధికారులు ఉన్నారు.

● **తాడేపల్లి టౌన్ (ఆంధ్రజ్యోతి):** పట్టణంలోని క్రిస్టియన్‌పేట పలు ప్రాంతాల్లో ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కేంద్రాలను సోమవారం తహసీల్దార్ డీ సీతారామయ్య, సీఐ కళ్యాణరాజులు పరిశీలించారు. ఈ నెల 27న జరుగనున్న ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి అక్కడి వసతుల ఏర్పాట్లను పరిశీలించారు. సజావుగా పోలింగ్ జరిగే విధంగా ఆయా పోలింగ్‌కేంద్రాల వద్ద చర్యలు తీసుకోవాలని సిబ్బందికి పలు సూచనలు చేశారు. కాగా ఎంటీఎంసీ కమిషనర్ అలీం బాషా సోమవారం నులకపేటలోని అన్న క్యాంటీన్ సందర్శించి క్యాంటీన్‌లో పరిశుభ్రత, అల్పాహారం, టోకెన్ల పంపిణీ తీరు పరిశీలించారు.

### కాకుమాను జడ్పీ పాఠశాలలో..

కాకుమాను, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా స్థానిక జడ్పీ పాఠశాలలో ఏర్పాటు చేసిన 260వ నెంబరు పోలింగ్ బూత్‌ను సోమవారం తహసీల్దార్ జీ వెంకటస్వామి పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు సలహాలు తెలియజేశారు. ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా క్యూలైన్లు, తాగునీరు వంటి సౌకర్యాలు కల్పించాలన్నారు. 26న ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరుగుతుందని తెలిపారు. ఇప్పటికే సిబ్బంది గ్రామాల్లో ఓటర్లకు స్లిప్పులు పంపిణీ చేయడం పూర్తయినట్లు తెలిపారు. తప్పనిసరిగా ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీవో, ఎస్ఐ ఏకనాథ్, ఆర్ఐ, వీఆర్వో అనూష పాల్గొన్నారు.

## ఎల్‌పీజీ వినియోగదారులకు ఈకేవైసీ తప్పనిసరి

మంగళగిరి సిటీ, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే సబ్సిడీల ద్వారా లబ్ధిపొందాలంటే ఎల్‌పీజీ వినియోగదారులందరూ తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాలని ఏపీ ఎల్‌పీజీ డిస్ట్రిబ్యూటర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కే శ్రీనాథ్‌రెడ్డి సూచించారు. ఎల్‌పీజీ డీలర్స్ అసోసియేషన్ సమావేశం మంగళగిరిలోని రాయల్ బ్యాంకెట్ హాల్లో సోమవారం జరిగింది. శ్రీనాథ్‌రెడ్డి మాట్లాడుతూ గ్యాస్ సిలెండర్ డెలివరీ తీసుకునే సమయంలో వినియోగదారులు తప్పనిసరిగా సిలెండర్ బరువు, లీకేజీలను సరిచూసుకోవాలన్నారు. మొబైల్ ఫోనుకు వచ్చిన బిల్లు, డెలివరీ ఇచ్చే గ్యాస్ బిల్లు సరిచూసుకుని బిల్లు చెల్లించాలని, డిజిటల్ పే ద్వారా కూడా సరైన రుసుం మాత్రమే చెల్లించాలని సూచించారు. ఈఎల్‌పీజీ డీలర్స్ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటిని భారీ మెజార్టీతో గెలిపించాలి

● కూటమి నేతల విస్తృత ప్రచారం

మంగళగిరి, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): కృష్ణా, గుంటూరు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను గెలిపించాలని కోరుతూ కాజ గ్రామంలో కూటమి నేతలు సోమవారం విస్తృత ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి పట్టభద్రులను కలిసి ఓట్లను అభ్యర్థించారు. కార్యక్రమంలో టీడీపీ గ్రామ అధ్యక్షుడు పల్లబోతుల శ్రీనివాసరావు, జనసేన అధ్యక్షుడు అప్పికట్ల వెంకటరత్నం నాయుడు, బీజేపీ అధ్యక్షుడు కారుమూరి శ్రీనివాసరెడ్డి, తెలుగురైతు రాష్ట్ర కార్యదర్శి గాదె పిచ్చిరెడ్డి, నేతలు నంబూరు రవి, దొడ్డక గంగరాజు, కుక్కమళ్ల దానియేలు, విక్రమ్, పల్నాటి నాగేశ్వరరావు, ప్రవీణ్‌కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● **తాడేపల్లి టౌన్ (ఆంధ్రజ్యోతి):** తాడేపల్లి పట్టణంలోని మహానాడు, ప్రైవేటు పాఠశాలలు, సబ్ స్టేషన్, సచివాలయం ప్రాంతాలలో కూటమి నాయకులు, కార్యకర్తలు విస్తృత ప్రచారం నిర్వహించారు. ఆలపాటికి మొదటి ప్రాధాన్య ఓటు వేసి గెలిపించాలని పట్టభద్రులను కలిసి ఓట్లు అభ్యర్థించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ పరిశీలకులు ముమ్మడి సత్యనారాయణ, పట్టణ అధ్యక్షుడు వల్లభనేని వెంకట్రావు మాట్లాడుతూ రాష్ట్రం అభివృద్ధి దిశగా అడుగులు వేయాలంటే కూటమికి మద్దతు తెలియజేయాలని అన్నారు. గత పాలనలో రాష్ట్రానికి ఎంత నష్టం జరిగిందో అందరికి తెలుసని అన్నారు. ఈ కార్యక్రమంలో ముమ్మడి సత్యనారాయణ, వల్లభనేని వెంకట్రావు, దొడ్డిపాటి వెంకటేశ్వర్లు, మేకా పుల్లారెడ్డి, అద్దంకి మురళి, ఇట్టా భాస్కర్, ధనూజ్, గాజుల శ్రీనివాస్, మండవ గోపాలరావు చిన్నపోతుల చిన్న, హరినాథ్, పెద్ద బుడే, లక్ష్మీనారాయణ, అన్నెం కుసుమ, కేసరి వెంకటరెడ్డి, కొసరాజు శైలజ, అనిల్, శ్రీనివాస్ మాల్యాద్రి రెడ్డి, అడపా నరేష్,



తాడేపల్లిలో ఓట్లు అభ్యర్థిస్తున్న నాయకులు

గోపి, లతా శ్రీనివాస్, కొండయ్య, ఆదిశేషు, కృష్ణవేణి, సుజాత, హరికృష్ణ కూటమి నేతలు పాల్గొన్నారు.

### శృంగారపురం, ముర్తుజానగర్‌లో..

దుగ్గిరాల, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శృంగారపురం, దుగ్గిరాలలోని ముర్తుజానగర్ లోనూ ఆలపాటిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరుతూ టీడీపీ నాయకులు ప్రచారం నిర్వహించారు. దుగ్గిరాలయార్డు మాజీ చైర్మన్ కొండూరు ముత్తయ్య, జూపల్లి వెంకటేశ్వరరావు, యలవర్తి అంకారావు, గూడూరు సునీల్, మేకా గోపి తదితరులు పాల్గొన్నారు. దుగ్గిరాలలో జరిగిన ప్రచారంలో షేక్ బాషా, ఫిరోజ్, కరీముల్లా, అయూబ్ పాల్గొన్నారు.

### తిక్కిరెడ్డిపాలెంలో ప్రచారం

ప్రత్తిపాడు, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): కూటమి



తిక్కిరెడ్డిపాలెంలో ప్రచారం నిర్వహిస్తున్న టీడీపీ నాయకులు

బలపరచిన అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కు మద్దతుగా మండల పరిధిలోని తిక్కిరెడ్డిపాలెంలో టీడీపీ నాయకులు ప్రచారం నిర్వహించారు. మండల అధ్యక్షుడు గింజుపల్లి శివరామప్రసాద్ ఆధ్వర్యంలో స్థానిక పార్టీ నాయకులు ఈ ప్రాచారం నిర్వహించారు. ఆలపాటికి మొదటి ప్రాధాన్య ఓటు వేసి గెలిపించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో కుర్రి సుబ్బారెడ్డి, డక్కుమళ్ల భాగ్యారావు, తిక్కిరెడ్డిపాలెం సర్పంచ్ మాకినేని జగన్, వెలి వెల్లి సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

### పెదనందిపాడు మండలంలో..

పెదనందిపాడు(కొప్పర్రు), ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): ఆలపాటి రాజాకు మద్దతుగా టీడీపీ నేతలు మండలపరిధిలోని కొప్పర్రులో సోమవారం ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి పట్టభద్రులను కలిసి విద్యావంతుడు ఆలపాటికి మొదటి ప్రాధాన్య ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ బత్తిని శారదా, బత్తిని వేణు, గోపీ తదితరులు పాల్గొన్నారు.

### తుళ్లూరులో ..

తుళ్లూరు, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి) భారీ మెజార్టీతో కృష్ణా గుంటూరు ఉమ్మడి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్ భారీ మెజార్టీతో గెలవటం తథ్యమని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి దామినేని శ్రీనివాసరావు, బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ కంతేటి బ్రహ్మయ్యలు అన్నారు. తుళ్లూరులో సోమవారం ఎమ్మెల్సీ ఓటర్లను కూటమి నాయకులు కలసి ఆలపాటిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరుతూ కరపత్రాలు అందించారు. కార్యక్రమంలో టీడీపీ గ్రామ అధ్యక్షుడు కాటా అప్పారావు, మాజీ అధ్యక్షుడు బండ్ల పట్టాభిరామయ్య, నాయకులు కంతేటి బాబు, మూల్పూరి రాంబాబు, గూడపాటి శ్రీకాంత్, నాగుల్ మీరా తదితరులు పాల్గొన్నారు.

## సమష్టిగా బ్రహ్మోత్సవాలను విజయవంతం చేద్దాం



సమీక్షలో పాల్గొన్న ఈవో రామకోటిరెడ్డి, వివిధ శాఖల అధికారులు

● దేవదాయ శాఖ సహాయ కమిషనర్, ఆలయ ఈవో అన్నపురెడ్డి రామకోటిరెడ్డి

మంగళగిరి సిటీ, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): మంగళాద్రి శ్రీలక్ష్మీ నృసింహస్వామి క్షేత్రంలో మార్చి 5 నుంచి 16వ తేదీ వరకు జరుగనున్న వార్షిక బ్రహ్మోత్సవాల్లో అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయాలని దేవదాయ శాఖ సహాయ కమిషనర్, ఆలయ ఈవో అన్నపురెడ్డి రామకోటిరెడ్డి కోరారు. బ్రహ్మోత్సవాల నిర్వహణకు సంబంధించి సోమవారం వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈవో మాట్లాడుతూ బ్రహ్మోత్సవాల్లో ముఖ్య ఘట్టాలైన పొన్నవాహన సేవ 12వ తేదీ రాత్రి, 13న అర్ధరాత్రి దాటిన తర్వాత స్వామివార్ల కల్యాణ మహోత్సవం, 14వ తేదీ మధ్యాహ్నం మూడు గంటల నుంచి శ్రీవారి దివ్య రథోత్సవం జరుగుతాయన్నారు. ఎంటీఎంసీ తరపున పారిశుధ్య సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని, తాత్కాలిక మరుగు దొడ్లు ఏర్పాటు చేయాలని, పోలీసు శాఖ తరపున అవుట్ పోస్టు, బందోబస్తు ఏర్పాటు చేయాలని, గ్రామోత్సవాలకు ఆటంకం కలుగకుండా పార్కింగ్, ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు తీసుకోవాలని, అగ్నిమాపక శాఖ తరపున ఫైర్ ఇంజన్‌ను అందుబాటు లో ఉంచాలని, వైద్య ఆరోగ్య శాఖ తరపున వైద్య శిబిరం ఏర్పాటు చేయాలని, నిరంతర విద్యుత్ సరఫరా కోసం ఆ శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. 12వ తేదీ రాత్రి నుంచి 14వ తేదీ రాత్రి వరకు మద్యం దుకాణాలను మూసివేయించాలని ఎక్సైజ్ అండ్ ప్రొబి షన్ అధికారులకు విజ్ఞప్తి చేశారు. సమావేశంలో ఫైర్ అధికారి వై వెంకటేశ్వర్లు, ఎంటీఎంసీ డిప్యూటీ కమిషనర్ శ్రీకాంత్, వైద్యాధికారి డాక్టర్ పీ అనూష, పట్టణ ఎస్ఐ శ్రీహరి, విద్యుత్‌శాఖ ఏఈ చిట్టిబాబు పాల్గొన్నారు.

## సిబార్‌తో ఎస్ఆర్ఎం యూనివర్సిటీ ఎంవోయూ

మంగళగిరి సిటీ, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): సిబార్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డెంటల్ సైన్సెస్‌తో ఏపీ ఎస్ఆర్ఎం యూనివర్సిటీ సోమవారం అవగాహనా ఒప్పందం కుదుర్చుకుంది. వర్సిటీలో సోమవారం జరిగిన అవగాహనా ఒప్పంద సమావేశంలో ఎస్ఆర్ఎం రిజిస్ట్రార్ ఆర్ ప్రేమ్ కుమార్, సిబార్ ప్రిన్సిపాల్ వెంకట రమణారెడ్డి, డీన్ కృష్ణప్రసాద్ ఎంవోయూ పత్రాలపై సంతకాలు చేశారు. ఎంవోయూ నేపథ్యంలో డాక్టర్ కృష్ణప్రసాద్ సిబార్ ఇన్‌స్టిట్యూట్ ప్రగతి, రీసెర్చ్ పురోగతిని వివరించారు. ఎస్ఆర్ఎం వైస్‌చాన్సలర్ మనోజ్‌కుమార్ అరోరా వర్సిటీలో కొనసాగుతున్న పరిశోధనల పురోగతిని వివరించి, అంతర్జాతీయ స్థాయిలో అత్యుత్తమ వర్సిటీగా ఏపీ ఎస్ఆర్ఎంను తీర్చిదిద్దడమే తమ ముందున్న లక్ష్యమని పేర్కొన్నారు. హెల్త్ కేర్ రీసెర్చి విషయంలోను, దంత సమస్యలు, వాటి పరిష్కారంపై ప్రజల్లో సమగ్ర అవగాహన పెంపొందించే విషయంలోనూ ఈ ఎంవోయూ ఉపకరిస్తుందని ఇరు సంస్థల ప్రతినిధులు అభిప్రాయపడ్డారు. ఎంవోయూలో కీలకంగా వ్యవహరించిన ఈసీఈ హెడ్ డాక్టర్ కేఏ సునీత మాట్లాడుతూ సిబార్ కళాశాలతో జరిగిన ఎంవోయూ వల్ల రెండు సంస్థల మధ్యన పరిశోధనల పరంగా వేగం పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఆర్ఎం రీసెర్చ్ డీన్ రంజిత్ థాపా, ఇంజనీరింగ్ స్కూల్ డీన్ సీవీ టామీ, డాక్టర్ జయశీలన్,



ఒప్పంద పత్రాలను చూపుతున్న డాక్టర్ ప్రేమ్‌కుమార్, డాక్టర్ కృష్ణప్రసాద్ తదితరులు

పార్థసారథి, సిబార్ ప్రతినిధులు డాక్టర్ కిరణ్‌కుమార్, డాక్టర్ చంద్రశేఖర్, డాక్టర్ రవీంద్రనాథ్ పాల్గొన్నారు.

### విద్యార్థులకు అభినందనలు

ఇండియన్ డెంటల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 15, 16 తేదీల్లో ఢిల్లీలోని డాక్టర్ అంబేద్కర్ యూనివర్సిటీలో డెంటల్ విభాగానికి చెందిన సృజనాత్మక పరిశోధనల సదస్సు జరిగింది. ఈ సదస్సుకు హాజరైన ఏపీ ఎస్ఆర్ఎం విద్యార్థులు సిబార్ ఇన్‌స్టిట్యూట్ సహకారంతో రూపొందించిన లేటెస్ట్ టెక్నాలజీ డెంటల్ చైర్‌ను ప్రదర్శించారు. దీనిని తయారు చేయడం లో కృషి చేసిన విద్యార్థులు ఎం.కోటేశ్వరరావు, దారపురెడ్డి దివ్య దీక్షిత, దరావత్ మాధురిలను ఎస్ఆర్ఎం ఉపకులపతి ఆచార్య మనోజ్‌కుమార్ అరోరా తదితరులు అభినందించారు.

## పట్టభద్రుల ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించాలి

● తహసీల్దార్ శంకర్‌బాబు



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్

పెదనందిపాడు, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): పట్టభద్రుల ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించాలని తహసీల్దార్ శంకర్‌బాబు అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో అధికారులతో సోమవారం సమావేశం నిర్వహించారు. మండలంలోని 1603 మంది ఓటర్లకు గాను పెదనందిపాడు జడ్పీ పాఠశాలలో నెం.258, 259 అను రెండు పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేశామని, మండలంలోని పట్టభద్రులు అందరూ తమ ఓటు హక్కును వినియెగించుకోవాలని కోరారు. ఓటు వినియోగించుకునే వారు తప్పనిసరిగా ఓటరు స్లిప్పుతో పాటు ఫొటో నమూనా కలిగిన గుర్తింపు కార్డు తెచ్చుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో లక్ష్మీదేవి, డిప్యూటీ తహసీల్దార్ కరిముల్లా, ఆర్ఐ సాహితీమోహన్, వీఆర్వో అనిల్ తదితరులు పాల్గొన్నారు.

## పొగాకు వ్యసనం నుంచి బయటపడాలి

● కేఎల్ ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్

తాడేపల్లి (వడ్డేశ్వరం), ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): పొగాకు వ్యసనం నుంచి ప్రతి ఒక్కరూ బయటపడాలని కేఎల్ ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ చక్రవర్తి అన్నారు. పొగాకు ఉత్పత్తులకు బానిసలైన వారు ఆ వ్యసనం నుంచి బయటపడి ఆరోగ్యకరమైన జీవితాన్ని గడపాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఎంటీఎంసీ పరిధిలోని వడ్డేశ్వరంలో పొగాకు ఉత్పత్తుల వల్ల కలిగే అనర్థాల గురించి కళాశాల ఎన్ఎస్ఎస్ వలంటీర్లు ఇంటింటికి వెళ్లి అవగాహన కల్పించారు. సిగరెట్, బీడీ, గుట్కా, ఖైనీ తదితర పొగాకు ఉత్పత్తుల వాడకం వల్ల నోరు, గొంతు, తదితర అవయవాలకు క్యాన్సర్ వచ్చే ప్రమాదం ఉందని గుండె, ఊపిరితిత్తుల అనారోగ్య సమస్యలు వస్తాయని చెప్పారు.

## నూతన బిల్డింగ్ పూర్తి చేస్తే చాలా సమస్యలు తీరుతాయి

● డీసీహెచ్ఎస్ మజీదా బేగం

ప్రత్తిపాడు, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): నూతనంగా నిర్మించిన బిల్డింగ్‌లో కొద్దిపాటి పనులున్నాయి. వాటిని పూర్తి చేసి మాకు అప్పగిస్తే ఈ వైద్యశాలలో ఉన్న చాలా వరకు సమస్యలు తీరుతాయని డీసీహెచ్ఎస్ మజీదా బేగం అన్నారు. ప్రత్తిపాడు సామాజిక ఆరోగ్య కేంద్రంలో వైద్యులు సరిగా అందుబాటులో ఉండటం లేదంటూ ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు ఆకస్మిక తనిఖీలో తేటతెల్లం కావడం, వెంటనే ఆయన డీసీహెచ్ఎస్‌కు ఫోన్ చేసి పరిశీలించాలని కోరిన విషయం విదితమే. ఎమ్మెల్యే సూచనల మేరకు ఆమె సోమవారం వైద్యశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఏడుగురు వైద్యులు ఉన్నా సరైన సౌకర్యాలు ఇక్కడ లేవని, రూమ్స్ లేకపోవడం వల్ల అందరూ ఒకే చోట కూర్చోవాల్సి వస్తుందన్నారు. వైద్యుల కదలికలపై ఎప్పటికప్పుడు నిఘా పెట్టామన్నారు. అర్ధరాత్రి కూడా వీడియో కాల్ చేసి వైద్యశాలలో ఉన్నారా లేరా అని తెలుసుకుంటున్నామన్నారు. సాయంత్రం 4 నుంచి రాత్రి 9 గంటల వరకు డ్యూటీలో ఎవరూ వైద్యులు ఉండటం లేదని ఆమె గుర్తించారు. ఇక నుంచి అలా జరగకుండా చర్యలు తీసుకుంటామన్నారు.



వైద్యులు, సిబ్బందితో మాట్లాడుతున్న డీసీహెచ్ఎస్ మజీదా

## వర్సిటీ క్రీడాకారిణి గాయత్రికి గోల్డ్ మెడల్

పెదకాకాని, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం క్రీడాకారిణి 38వ జాతీయ మహిళా క్రీడా పోటీల్లో గోల్డ్ మెడల్ సాధించింది. గత నెల 28 నుంచి ఈనెల 14 వరకు ఉత్తరాఖండ్‌లో జరిగిన 38వ జాతీయ మహిళల క్రీడల్లో వెలగపూడి రామకృష్ణ స్మారక కళాశాల(నగరం) విద్యార్థిని నాగిడి గాయత్రి అద్వితీయ ప్రతిభ కనబరిచి గోల్డ్ మెడల్ సాధించినట్లు డైరెక్టర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ ప్రొఫెసర్ పీపీఎస్ పాల్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు సోమవారం గాయత్రితో యూనివర్సిటీ వైస్ చాన్సలర్ కే గంగాధర్‌రావును మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వీసీ గాయత్రిని అభినందించారు.



గాయత్రిని అభినందిస్తున్న వర్సిటీ వీసీ

## తప్పించుకు తిరుగుతున్న నిందితుడి అరెస్టు



నిందితుడ్ని అరెస్టు చూపుతున్న ఎస్ఐ

మంగళగిరి, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): రెండేళ్లుగా కోర్టు వాయిదాలకు హాజరు కాకుండా తప్పించుకుని తిరుగుతున్న నిందితుడ్ని మంగళగిరి రూరల్ పోలీసులు అరెస్టు చేశారు. ఎస్ఐ చిరుమామిళ్ల వెంకట్ తెలిపిన వివరాల ప్రకారం.. మంగళగిరి మండలం ఎర్రబాలెం గ్రామానికి చెందిన కొల్లి మోహన్ 2019లో పోక్సో చట్టం కేసులో అరెస్టు కాగా, పోలీసులు కోర్టులో హాజరుపర్చారు. అయితే, మోహన్ రెండేళ్లుగా కోర్టు వాయిదాలకు హాజరు కాకుండా తిరుగుతుండటంతో న్యాయస్థానం ఎన్‌బీడబ్ల్యూ వారెంట్ జారీ చేసింది. దీంతో మోహన్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని సోమవారం కోర్టులో హాజరుపర్చగా, న్యాయాధికారి 14 రోజుల రిమాండ్ విధించారని ఎస్ఐ వెంకట్ తెలిపారు. వివిధ కేసుల్లో కోర్టు వాయిదాలు ఎదుర్కొంటున్న నిందితులు క్రమం తప్పకుండా వాయిదాలకు హాజరుకావాలని, లేనిపక్షంలో చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## వర్సిటీని సందర్శించిన లిబియా దేశ ప్రతినిధి

పెదకాకాని, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయాన్ని లిబియా దేశ ప్రతినిధి సోమవారం సందర్శించారు. లిబియా ఎంబసీ నుంచి అకాడమిక్ అటాచిగా విధులు నిర్వహిస్తున్న మహమ్మద్ ఎజ్వలి ఈ పర్యటనలో ఉన్నారు. విశ్వవిద్యాలయంలో లిబియా విద్యార్థులకు బోధన, పరిశోధన అంశాల వివరాలు తెలుసుకునేందుకు ఆయన పర్యటన సాగింది. ప్రస్తుతం యూనివర్సిటీలో ఉన్న లిబియా విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా విశ్వవిద్యాలయంతో పరస్పర అవగాహన ఒప్పందం కుదుర్చుకునేందుకు వీసీ కే గంగాధరరావు, ఇన్‌చార్జి రెక్టార్‌లను కలిసి వివిధ విషయాలపై చర్చించారు.



## 30 పడకల ఆస్పత్రిని అందుబాటులోకి తీసుకురావాలి

● వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌కు బీజేపీ నాయకుల విజ్ఞప్తి



వెలగపూడి సచివాయంలో మంత్రి సత్యకుమార్‌ను కలసి వినతిపత్రం ఇస్తున్న బీజేపీ నాయకులు

తుళ్లూరు, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): తుళ్లూరులో నిర్మించిన 30 పడకల సామాజిక ఆస్పత్రిని అందుబాటులోకి తీసుకురావాలని సోమవారం అసెంబ్లీ సమావేశాలకు వచ్చిన వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్‌ని వెలగపూడి సచివాలయంలో బీజేపీ నేతలు కలసి విన్నవించారు. 2016 టీడీపీ ప్రభుత్వంలో 4.30 లక్షలతో ఆస్పత్రి బిల్డింగ్‌కి అప్పటి వైద్య ఆరోగ్యశాఖ మంత్రి కామినేని శ్రీనివాస్ శంకుస్థాపన చేశారని, బిల్డింగ్ పూర్తి చేసి అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రారంభోత్సవం చేశారని మంత్రికిచ్చిన వినతిపత్రంలో తెలిపారు. పరికరాలు సమకూర్చకపోవటమే కాకుండా డాక్టర్స్, పారామెడికల్ సిబ్బందిని కేటాయించలేదని, గత వైసీపీ ప్రభుత్వంలో ఈ సామాజిక ఆరోగ్యకేంద్రం గురించి పట్టించుకోలేదన్నారు. రాజధాని పనులు పునఃప్రారంభం కానున్న నేపథ్యంలో ఇక్కడకు వివిధ రాష్ట్రాల నుంచి వచ్చే కార్మికులకు, గ్రామాల్లో ప్రజానీకానికి అత్యవసర వైద్యం కావాలంటే గుంటూరు గానీ విజయవాడ వెళ్లాల్సిన పరిస్థితి నెలకొందని, మంత్రి స్వయంగా పరిశీలించి సదుపాయాలను, సిబ్బందిని ఏర్పాటు చేయాలని విన్నవించారు. మంత్రి కలిసిన వారిలో బీజేపీ మండల అధ్యక్షుడు నీరుకొండ లక్ష్మీనారాయణ, జిల్లా కార్యదర్శి మార్త నరేంద్రబాబు, నాయకులు కొమ్మినేని సత్యనారాయణ, తొండెపు శివరామగుప్త, నెమలిపురి వెంకటేశ్ తదితరులున్నారు.

## బడ్జెట్‌లో చేనేతకు రూ.2 వేల కోట్లు కేటాయించాలి

ఏపీ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిల్లలమర్రి



ఏడీ శ్రీకాంత్ ప్రభాకర్‌కు వినతిపత్రం అందజేస్తున్న చేనేత కార్మిక సంఘం ప్రతినిధులు

మంగళగిరి సిటీ, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర బడ్జెట్‌లో చేనేత రంగానికి రూ.రెండు వేల కోట్లు కేటాయించాలని ఏపీ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిల్లలమర్రి నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం సంఘం ఆధ్వర్యంలో చేనేత జౌళిశాఖ అడిషనల్ డైరెక్టర్ కే శ్రీకాంత్ ప్రభాకర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. నాగేశ్వరరావు మాట్లాడుతూ చేనేత సహకార సంఘాలకు తక్షణమే ఎన్నికలు నిర్వహించాలని, నేతన్న నేస్తం రూ.24 వేల నుంచి రూ.36 వేలకు పెంచి నేత కార్మికులు, ఉపవృత్తుల వారికి ఇవ్వాలని, చేనేత రిజర్వేషన్ చట్టాన్ని కఠినంగా అమలు జరపాలని, ప్రతి జిల్లాలోనూ చేనేత పార్కులు ఏర్పాటు చేయాలని కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి జిల్లాలోనూ మూడు నెలలకోసారి కలెక్టర్ల ఆధ్వర్యంలో చేనేత కార్మిక సంఘాలతో సమీక్ష నిర్వహించి, చేనేత సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రస్తుత బడ్జెట్‌లో చేనేత పరిశ్రమకు రూ.రెండు వేల కోట్లు కేటాయించాలని, లేనిపక్షంలో ఆయా కార్యాలయాల వద్ద ఆందోళనలు నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో చేనేత కార్మిక సంఘం ప్రతినిధులు గొట్టుముక్కల బాలాజీ, గజవల్లి వెంకటకృష్ణ, బత్తూరి మోహనరావు, ఇమ్మంది శ్రీనివాసరావు, గంజి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## పదోతరగతిలో మంచి ఫలితాలు సాధించాలి

● విద్యార్థినుల వీడ్కోలు కార్యక్రమంలో హెచ్ఎం శోభారాణి



జడ్పీ బాలికోన్నత పాఠశాలలో గురువులతో కలిసి పదోతరగతి విద్యార్థినులు

దుగ్గిరాల, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): పదోతరగతి పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించి, తల్లిదండ్రులకు, పాఠశాలకు పేరు తీసుకురావాలని దుగ్గిరాలలోని జిల్లాపరిషత్ బాలికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయిని శానంపూడి శోభారాణి అన్నారు. మార్చినెలలో పదో తరగతి కామన్ పరీక్షలకు బాలికలు హాజరు కానుండగా వీడ్కోలు కార్యక్రమాన్ని సోమవారం ఘనంగా జరుపుకున్నారు. సంప్రదాయం ఉట్టిపడేలా వస్త్రాలు ధరించి, తోటి స్నేహితులతో కలిసి ఆటపాటలతో గురువులను అలరించారు. ఉపాధ్యాయినులతో కలిసి గ్రూపుఫొటో దిగారు.

## లక్ష్మణరావు విజయాన్ని కోరుతూ సీఐటీయూ ప్రచారం



చిర్రావూరులో సీపీఎం నేతల ప్రచారం

తాడేపల్లి (వడ్డేశ్వరం), ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): కృష్ణా గుంటూరు ఉమ్మడి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గం పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కేఎస్ లక్ష్మణరావు విజయాన్ని కాంక్షిస్తూ సోమవారం వడ్డేశ్వరంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో సీఐటీయూ నాయకులు వేముల దుర్గారావు ఆధ్వర్యంలో విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ తాడేపల్లి పట్టణ కార్యదర్శి వేముల దుర్గారావు మాట్లాడుతూ 40రోజులకు పైబడి అంగన్‌వాడీ సమస్యలపై అంగన్‌వాడీ కార్యకర్తలు చేసిన సమ్మెకు సంపూర్ణ మద్దతు తెలియజేయడమే కాక శాసనమండలిలో అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని పీడీఎఫ్ ఎమ్మెల్సీ లక్ష్మణరావు విశేషంగా కృషి చేశారన్నారు. కేఎస్ లక్ష్మణరావును గెలిపించాలని పట్టభద్రుల ఓటర్లను ఓట్లు అభ్యర్థించారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు బూరుగ వెంకటేశ్వరరావు, విజయభాస్కరరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

● తాడేపల్లి మండలం చిర్రావూరులో లక్ష్మణరావు విజయాన్ని కాంక్షిస్తూ సోమవారం రాత్రి సీపీఎం, ప్రజాసంఘాల నేతలు కరపత్రాలు పంపిణీ చేస్తూ పట్టభద్రులను ఓట్లు అభ్యర్థించారు. కార్యక్రమంలో కౌలు రైతు సంఘం తాడేపల్లి మండల కార్యదర్శి పల్లె కృష్ణ, వ్యకాస తాడేపల్లి మండల అధ్యక్షులు పరిమిశెట్టి శివనాగేశ్వరరావు, పట్టణ సీఐటీయూ నేత దశరథరెడ్డి, కౌలురైతు సంఘం నేతలు పాములు, సుబ్బారావు, శివయ్య తదితరులు పాల్గొన్నారు.

## మహా శివరాత్రికి శివాలయాలు ముస్తాబు

వట్టిచెరుకూరు, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): మహా శివరాత్రి సందర్భాన్ని పురస్కరించుకొని మండలంలోని గ్రామాల్లో శివాలయాలను రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరిస్తున్నారు. వట్టిచెరుకూరులోని గంగా భ్రమరాంబిక సమేత బ్రహ్మేశ్వరస్వామి ఆలయం, అనంతవరప్పాడులోని గంగా భ్రమరాంబిక సమేత మల్లేశ్వరస్వామి ఆలయం, చమళ్ళమూడి, ముట్లూరు, కొర్నెపాడు గ్రామాల్లోని శివాలయాల్లో ఈనెల 26వ తేదీ మహాశివరాత్రి సందర్భంగా భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా విస్తృత ఏర్పాట్లు చేసి రంగురంగుల విద్యుత్‌దీపాలతో శోభాయమానంగా అలంకరించారు.

# తెనాలి వార్తలు

◆ తెనాలి ◆ పొన్నూరు

## ప్రజలు ఇవ్వని హోదా కోసం జగన్ ఆరాటం

మాజీ మంత్రి దేవినేని



ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు

పొన్నూరు టౌన్, ఫిబ్రవరి, 24 (ఆంధ్రజ్యోతి): ప్రజలు ఇవ్వని హోదా కోసం మాజీ సీఎం జగన్ ఆరాటపడుతున్నారని మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు ఎద్దేవా చేశారు. మండల పరిధిలోని కసుకర్రు, నందూరు గ్రామాల్లో సోమవారం బూత్ కన్వీనర్ల సమావేశం జరిగింది. దేవినేని మాట్లాడుతూ రానున్న పట్టభద్రుల ఎన్నికల్లో కూటమి అభ్యర్థి ఆలపాటి రాజాను ఎమ్మెల్సీగా గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. 11మంది ఎమ్మెల్యేలతో కలిసి అసెంబ్లీలో 11 నిమిషాలు జగన్ ఉండలేకపోయాడని విమర్శించారు. జగన్ వింతపోకడలు చూస్తుంటే ఆశ్చర్యం కలుగుతుందని, 11 అనే సంఖ్య జగన్‌ను వేధిస్తుందని, చివరకు ఆ సంఖ్యలో ఉన్న ఒకటిని కూడా ప్రజలు తీసేస్తారని తెలుసుకోవాలన్నారు. ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ నేతృత్వంలో ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి గెలుపు కోసం పాటుపడాలని నేతలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గుంటూరు మిర్చి యార్డు మాజీ చైర్మన్ మన్నవ సుబ్బారావు, టీడీపీ నాయకులు మాదల వెంకటేశ్వరరావు, బొర్రా రామారావు, బండ్లమూడి బాబురావు, సొపాటి వెంకట్రావు, గనిపిశెట్టి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## విధులకు గైర్హాజరై నిరసన తెలిపిన న్యాయవాదులు



కోర్టు ప్రాంగణం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న న్యాయవాదులు

తెనాలి క్రైం, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): తెనాలి బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం న్యాయవాదులు విధులకు గైర్హాజరై నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షులు బేతాళ ప్రభాకర్ మాట్లాడుతూ ఇటీవల కేంద్ర ప్రభుత్వం న్యాయవాద స్వేచ్ఛను హరించే విధంగా న్యాయవాదుల అమెండ్‌మెంట్ యాక్టు 2025ను కేంద్రం న్యాయశాఖకు సిఫార్సు చేసింది. ఇది అమలు జరిగితే న్యాయవాదులు వృత్తిపరంగా అనేక కఠిన సమస్యలు ఎదుర్కోవాల్సి ఉంటుంది. ఇది కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న తొందరపాటు చర్య. ఈ చట్టాన్ని ఉపసంహరించే వరకు న్యాయవాదులు తమ విధులను బహిష్కరిస్తారని ప్రభాకర్ తెలిపారు. ఈ నిరసన కార్యక్రమంలో కార్యదర్శి గౌరీశంకర్, సీనియర్, జూనియర్ న్యాయవాదులు తాడిబోయిన శ్రీనివాసరావు, దంతాల కిరణ్‌కుమార్, బొంతా ఆంజనేయులు, అన్నం పిన్నారావు, కొమ్ము అబ్రహంలింకన్, స్టాలిన్, రమేష్, డి.మల్లికార్జునరెడ్డి, మదిర సురేష్‌కుమార్, కుమారస్వామి, కనపర్తి మధుకర్, ఆర్ రాఘవేంద్ర, రెహానాబేగం, లత, కిషోర్‌కుమార్, కనపర్తి బెన్‌హర్, రాజా శ్రీనివాసగౌడ్ తదితరులు పాల్గొ న్నారు.

## శ్రీశైల భక్తసేవా సమితి సేవలు అభినందనీయం

● డీఎస్పీ జనార్ధనరావు



శ్రీశైలానికి వాహనాన్ని పంపేందుకు జెండా ఊపి ప్రారంభిస్తున్న డీఎస్పీ జనార్ధనరావు

తెనాలి రూరల్, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని శ్రీశైలం వెళ్లే భక్తుల కోసం తెనాలి శ్రీశైలభక్తసేవా సమితి అందిస్తున్న సేవలు అభి నందనీయమని డీఎస్పీ జనార్దనరావు అన్నారు. సోమవారం పట్టణంలోని శ్రీశైల భక్త సేవాసమితి ఆధ్వర్యంలో మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని శ్రీశైలంలో జరిగే ఉత్సవాలకు లక్షలాదిగా వెళ్లే భక్తుల సౌకర్యార్థం అన్నప్రసాదానికి నిత్యావసరాలు, మంచినీరు, వైద్యసేవలకు అవసరమైన మందులతో కూడిన వాహనాన్ని డీఎస్పీ జనార్దనరావు ముఖ్యఅతిథిగా హాజరై జెండా ఊపి ప్రారంభించారు. సమితి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## బుర్రిపాలెంలో నవరత్నాల పోస్టర్ తొలగించరూ



బుర్రిపాలెం సచివాలయంపై నవరత్నాల పేరుతో జగన్‌మోహన్‌రెడ్డి ఫోటో

తెనాలి రూరల్, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): బుర్రిపాలెం గ్రామంలో సచివాలయంపై ఉన్న నవరత్నాలు లోగోతో జగన్‌మోహన్‌రెడ్డి బొమ్మను తొలగించాలని పలువురు గ్రామస్తులు కోరుతున్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన తరువాత గ్రామంలో రాజకీయ నాయకులు విగ్రహాలకు ముసుగులు కప్పగా ఫ్లెక్సీలను తొలగించారు. గ్రామంలో నిర్మించిన సచివాలయంపై ఉన్న జగన్‌మోహన్‌రెడ్డి నవరత్రాలు లోగోపై పంచాయతీ అధికారులు ఏటువంటి చర్యలు తీసుకోకపోవడంపై ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తక్షణమే లోగోను తొలగించాలని కోరుతున్నారు.

## లక్ష్మణరావు కృషిని గుర్తించి గెలిపించాలి

● ఐద్వా కార్యదర్శి రమాదేవి

తెనాలి అర్బన్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : శాసన మండలిలో ఎమ్మెల్సీగా కేఎస్ లక్ష్మణరావు చేస్తున్న కృషిని గుర్తించి ఎన్నికల్లో మళ్లీ ఆయననే గెలిపించాలని ఐద్వా కార్యదర్శి డి.రమాదేవి కోరారు. తెనాలిలో సోమవారం జరిగిన ప్రచారంలో ఆమె పాల్గొన్నారు. పలు పాఠశాలలు, కార్యాలయాలను సందర్శిం చి పట్టభద్రులను ఓట్లు అభ్యర్థించారు. దుగ్గిరాల పసుపు రైతులకు అండగా ఉన్నారని, గుంటూరు ఛానల్ పొడిగించి సాగునీరు అందించేందుకు కృషి చేశారని చెప్పారు. ఎమ్మెల్సీపై అసత్య ప్రచారం చేస్తున్న వారు ఆధారాలతో నిరూపించాలని సవాల్ విసిరారు. ములకా శివసాంబిరెడ్డి, హుస్సేన్‌వలి, స్టాలిన్ తదితరులు పాల్గొన్నారు.

## సిబార్‌తో ఎస్‌ఆర్‌ఎం యూనివర్సిటీ ఎంవోయూ



ఒప్పంద పత్రాలను చూపుతున్న డాక్టర్ ప్రేమ్‌కుమార్, డాక్టర్ కృష్ణప్రసాద్ తదితరులు

మంగళగిరి సిటీ, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): సిబార్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డెంటల్ సైన్సెస్‌తో ఏపీ ఎస్‌ఆర్‌ఎం యూనివర్సిటీ సోమవారం అవగాహనా ఒప్పందం కుదుర్చుకుంది. వర్సిటీలో సోమవారం జరిగిన అవగాహనా ఒప్పంద సమావేశంలో ఎస్‌ఆర్‌ఎం రిజిస్ట్రార్ ఆర్ ప్రేమ్ కుమార్, సిబార్ ప్రిన్సిపాల్ వెంకట రమణారెడ్డి, డీన్ కృష్ణప్రసాద్ ఎంవోయూ పత్రాలపై సంతకాలు చేశారు. ఎంవోయూ నేపథ్యంలో డాక్టర్ కృష్ణప్రసాద్ సిబార్ ఇన్‌స్టిట్యూట్ ప్రగతి, రీసెర్చ్ పురోగతిని వివరించారు. ఎస్ఆర్‌ఎం వైస్‌చాన్సలర్ మనోజ్‌కుమార్ అరోరా వర్సిటీలో కొనసాగుతున్న పరిశోధనల పురోగతిని వివరించి, అంతర్జాతీయ స్థాయిలో అత్యుత్తమ వర్సిటీగా ఏపీ ఎస్‌ఆర్‌ఎంను తీర్చిదిద్దడమే తమ ముందున్న లక్ష్యమని పేర్కొన్నారు. హెల్త్ కేర్ రీసెర్చి విషయంలోను, దంత సమస్యలు, వాటి పరిష్కారంపై ప్రజల్లో సమగ్ర అవగాహన పెంపొందించే విషయంలోనూ ఈ ఎంవోయూ ఉపకరిస్తుందని ఇరు సంస్థల ప్రతినిధులు అభిప్రాయపడ్డారు. ఎంవోయూలో కీలకంగా వ్యవహరించిన ఈసీఈ హెడ్ డాక్టర్ కేపీ సునీత మాట్లాడుతూ సిబార్ కళాశాలతో జరిగిన ఎంవోయూ వల్ల రెండు సంస్థల మధ్యన పరి శోధనల పరంగా వేగం పెరుగుతుందన్నారు. ఈ కార్యక్ర మంలో ఎస్‌ఆర్‌ఎం రీసెర్చ్ డీన్ రంజిత్ థాపా, ఇంజనీరింగ్ స్కూల్ డీన్ సీవీ టామీ, డాక్టర్ జయశీలన్, పార్థసారథి, సిబార్ ప్రతినిధులు డాక్టర్ కిరణ్‌కుమార్, డాక్టర్ చంద్రశేఖర్, డాక్టర్ రవీంద్రనాథ్ పాల్గొన్నారు.

### విద్యార్థులకు అభినందనలు

ఇండియన్ డెంటల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 15, 16 తేదీల్లో ఢిల్లీలోని డాక్టర్ అంబేద్కర్ యూనివర్సిటీలో డెంటల్ విభాగానికి చెందిన సృజనాత్మక పరిశోధనల సదస్సు జరిగింది. ఈ సదస్సుకు హాజరైన ఏపీ ఎస్‌ఆర్‌ఎం విద్యార్థులు సిబార్ ఇన్‌స్టిట్యూట్ సహకా రంతో రూపొందించిన లేటెస్ట్ టెక్నాలజీ డెంటల్ చైర్‌ను ప్రదర్శించారు. దీనిని తయారు చేయడం లో కృషి చేసిన విద్యార్థులు ఎం.కోటేశ్వరరావు, దారపురెడ్డి దివ్య దీక్షిత, దరావత్ మాధురిలను ఎస్‌ఆర్‌ఎం ఉపకులపతి ఆచార్య మనోజ్‌కుమార్ అరోరా తదితరులు అభినందించారు.

## భక్తిశ్రద్ధలతో ప్రారంభమైన శివరాత్రి ఉత్సవాలు

● తొలిరోజు భారీగా తరలివచ్చిన భక్తులు ● బాలకోటేశ్వరస్వామికి ఏకాదశి పూజలు



స్వామి దర్శనం కోసం క్యూలో వేచి ఉన్న భక్తులు, పొంగళ్ళు వండుతున్న మహిళలు, ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్న పశు సంపద

పొన్నూరు టౌన్(చేబ్రోలు), ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): జిల్లాలోనే ప్రముఖ శైవక్షేత్రం శ్రీక్వారీ బాలకోటేశ్వరస్వామి ఆలయం వద్ద సోమవారం శివరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో ప్రారంభమయ్యాయి. మూడు రోజులపాటు ఆలయంలో ప్రత్యేకపూజలు చేయనున్నారు. దీనికి దేవదాయ శాఖ విస్తృత ఏర్పాట్లు చేసింది. తొలిరోజు ఏకాదశి సందర్భంగా ఆలయానికి మహిళలు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. వేకువజామునుండే మూలవిరాట్ బాలకోటేశ్వరస్వామికి పంచామృత అభిషేకాలు నిర్వహించారు. మహిళలు స్వామికి నైవేద్యాలు సమర్పించగా, రైతులు తమ గోవులు, పశువులను ఆలయాల చుట్టూ ప్రదక్షిణలు చేయించి మొక్కుబడులు తీర్చుకున్నారు. ప్రభల నిర్వాహకులు ఊరేగింపుగా ఆలయానికి తరలివచ్చి ప్రదక్షిణలు చేశారు. ఆలయాల వద్ద సుద్దపల్లి గ్రామస్థుల విద్యుత్‌ప్రభ భక్తులను ఆకట్టుకుంటోంది. ఆలయాల వద్ద విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రభలు వచ్చి వెళ్లే మార్గంలో ఎటువంటి అవాంతరాలు తలెత్తకుండా చర్యలు చేపట్టారు. భక్తుల సౌకర్యార్థం మొబైల్ టాయిలెట్లను ఏర్పాటుచేశారు. శిక్షణలో ఉన్న ఐపీఎస్ అధికారి దీక్ష ఆధ్వర్యంలో శాంతిభద్రతలు, తెనాలి సబ్‌కలెక్టర్ సంజనాసిన్హా ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.

## ఎమ్మెల్సీగా ఆలపాటిని గెలిపించుకుందాం

● మైనారిటీ కార్పొరేషన్ చైర్మన్ ముస్తాక్ అహ్మద్



ఆలపాటి గెలుపుకోరుతూ ప్రచారం నిర్వహిస్తున్న ముస్తాక్ అహ్మద్ తదితరులు

తెనాలి రూరల్, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): కృష్ణా, గుంటూరు ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీచేస్తున్న ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను ఘన విజయంతో గెలపించుకుందామని మైనారిటీ కార్పొరేషన్ చైర్మన్ ముస్తాక్ అహ్మద్ అన్నారు. సోమవారం పట్టణంలోని 22వ వార్డులో ముస్లిం మైనార్టీ నాయకులు, కూటమి శ్రేణులతో కలిసి ఎమ్మెల్సీగా ఆలపాటిని గెలిపించాలని కోరుతూ ప్రచారం నిర్వహించారు. టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

### ఉద్యోగుల కష్టసుఖాలు తెలిసిన ఆలపాటిని గెలిపించండి

ఉద్యోగులు, నిరుద్యోగుల కష్టసుఖాలు తెలిసిన ఆలపాటిని గెలిపించాలని రాష్ట్ర వాణిజ్యవిభాగ అధికారప్రతినిధి ఈదర వెంకటపూర్ణచంద్ అన్నారు. సోమవారం పట్టణంలోని పలువురు ఉద్యోగులను కూటమి నాయకులు నల్లూరి వెంకటేశ్వరరావు, మాదల కోటేశ్వరరావు, వెనిగళ్ల శివప్రసాద్, రావి సుబ్బారావు తదితర పార్టీ శ్రేణులు కలిసి ప్రచారం నిర్వహించి కరపత్రాలు అందించారు.

### టీడీపీ నాయకుల ప్రచారం

తెనాలి అర్బన్: ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేస్తున్న మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్‌ను గెలిపించాలని కోరుతూ టీడీపీ నాయకులు సోమవారం విస్తృత ప్రచారం చేశారు. మున్సిపల్ కార్యాలయం, ఐటీఐ, ప్రభుత్వ కార్యాలయాల్లోని ఉద్యోగులను కలిసి ఓటు అభ్యర్థించారు. టీడీపీ అధికార ప్రతినిధి ఈదర వెంకటపూర్ణచంద్, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ మాదల వెంకటేశ్వరరావు, నల్లూరి వెంకటేశ్వరరావు, వెనిగళ్ల శివప్రసాద్, సుబ్బారావు పాల్గొన్నారు.

### అమరావతి కాలనీ సంఘ మద్దతు

ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఆలపాటి రాజేంద్రప్రసాద్ అమరావతి కాలనీ సంఘం మద్దతు ప్రకటించింది. సంఘ అధ్యక్షుడు గుమ్మడి నారాయణరావు, కార్యదర్శి పూర్ణచంద్రరావు, కమిటీ సభ్యులు సోమవారం ఒక ప్రకటనలో మద్దతు తెలిపారు. కాలనీలోని పట్టభద్రులంతా మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని కోరారు.



ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు

## ఓటు హక్కును వినియోగించుకోవాలి

పొన్నూరు టౌన్, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి):కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రులు తమ ఓటుహక్కును తప్పనిసరిగా వినియోగించుకోవాలని నోడల్ అధికారి కె.సంజీవరావు అన్నారు. పట్టణంలో ఓటుహక్కు వినియోగంపై సోమవారం స్వీప్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రదర్శన నిర్వహించి, విద్యార్థులు, అధికారులు ఓటుహక్కు వినియోగంపై ప్రతిజ్ఞ చేశారు. ఈ నెల 27న జరిగే పోలింగ్‌లో అర్హులైన ప్రతి ఓటరు పాల్గొని తమ ఓటుహక్కును వినియోగించుకోవాలన్నారు. ఓటు వేయడం ద్వారానే ప్రజాస్వామ్య పరిరక్షణ సాధ్యపడుతుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ముప్పాళ్ల రమేష్‌బాబు, జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి కె.రమాదేవి, జూనియర్ ఎంప్లాయిస్ అధికారి ఎం.రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

## ప్రకృతి వ్యవసాయంతో సంపూర్ణ ఆరోగ్యం

కొల్లిపర, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయంతో సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందవచ్చని ప్రకృతి వ్యవసాయాధికారి మాధవి అన్నారు. సోమవారం కొల్లిపర మండల పరిషత్ కార్యాలయంలో రైతు సాధికార సంస్థ ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన కూరగాయలు, ఆకుకూర పంటలను కొల్లిపర మండల మోడల్‌టీమ్ ప్రదర్శన నిర్వహించారు. రైతులకు ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన పంటలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాధవి మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన పంటలను ఆహారంగా తీసుకోవడం వల్ల అనేక ఉపయోగాలు ఉన్నాయన్నారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన పంటలకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉందన్నారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ యూనిట్ ఇన్‌చార్జిలు నాగజ్యోతి, సుధారాణి, ఎంటీలు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి పెట్టాలి

కొల్లిపర, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి పెట్టాలని ఎంఈవో సాల్మన్‌రాజు అన్నారు. సోమవారం మండలంలోని తూములూరు, కొల్లిపర, దావులూరు గ్రామాల్లోని ప్రాథమిక పాఠశాలలను ఆయన తనిఖీ చేశారు. రికార్డులను, మధ్యాహ్న భోజనపథకాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా సాల్మన్‌రాజు మాట్లాడుతూ ప్రతి నెల విద్యార్థుల ప్రగతిపై తల్లిదండ్రులతో చర్చించాలన్నారు. ప్రతి పాఠశాలలోను ఉపాధ్యాయులు పారిశుధ్యంపై శ్రద్ధ వహించాలన్నారు. పాఠశాలల్లో సమస్యలుంటే తన దృష్టికి తేవాలన్నారు.

## శివరాత్రికి ఆర్టీసీ ప్రత్యేక బస్సు సర్వీసులు

పొన్నూరు టౌన్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా పొన్నూరు నుంచి శ్రీశైలానికి ప్రత్యేక ఆర్టీసీ బస్సు సర్వీసులు ఏర్పాటు చేసినట్లు డిపో మేనేజర్ టి.అజితకుమారి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 25, 26, 27 తేదీల్లో శ్రీశైలానికి ప్రతిరోజూ ఉదయం 5, 7 గంటలకు, రాత్రి 8.30 గంటలకు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. 26న ఉదయం 5 గంటలకు పొన్నూరు నుంచి గోవాడకు 8 అదనపు బస్సులను 27వ తేదీ వరకు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ ప్రత్యేక బస్సుల్లో సాధారణ చార్జీలే విధించనున్నట్లు భక్తులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

## పెదరావూరులో ముగిసిన హోమ పూజలు

తెనాలి రూరల్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): లోక కల్యాణాన్ని కాంక్షిస్తూ పెదరావూరు శ్రీగణపతి సచ్చిదానంద దత్తపీఠంలో తలపెట్టిన హోమపూజలు సోమవారంతో ముగిశాయి. ఈ నెల 22 నుంచి ప్రారంభమైన హోమాది పూజలో వేద పండితులు సుమారు 40 మంది వరకూ పాల్గొని పూజా కార్యక్రమాలు జరిపారు. చివరి రోజు పూర్ణాహుతితో హోమపూజలు ముగిశాయి. పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలకు బీరువా వితరణ

పొన్నూరు టౌన్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని మాచవరం జిల్లా పరిషత్ పాఠశాలకు దాత సోమవారం బీరువాను బహూకరించారు. పాఠశాల నిర్వాహణ కమిటీ చైర్మన్ సీహెచ్ నటరాజ్, హెచ్ఎం వైసీహెచ్ రామారావులకు దాత, విశ్రాంత ఉపాధ్యాయురాలు గోగినేని సుమతి బీరువాను అందజేశారు. ఈ సందర్భంగా దాత సుమతిని ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలి..



సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌చార్జి ఎంపీడీవో భార్గవ్

కొల్లిపర, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఇన్‌చార్జి ఎంపీడీవో భార్గవ్ అన్నారు. సోమవారం స్థానిక మండలపరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా భార్గవ్ మాట్లాడుతూ గ్రామాల్లో చెత్త చెదారం పేరుకుపోకుండా చూసుకోవాలన్నారు. కాల్వల్లో ఉన్న మురుగునీటిని తొలగించి బ్లీచింగ్‌ను చల్లించాలన్నారు. గ్రామాల్లో దోమల నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. బహిరంగ మలవిసర్జనను నిర్మూలించడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. సమావేశంలో పరిపాలనాధికారి ప్రతాప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## క్వారీ తిరునాళ్ళకు వాహనాల దారిమళ్ళింపు: ఎస్పీ

గుంటూరు, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి సందర్భంగా వడ్లమూడి క్వారీ తిరునాళ్ళకు వాహన రాకపోకలను దారి మళ్ళించినట్లు ఎస్పీ సతీష్‌కుమార్ తెలిపారు. వాహనచోదకులు నిబంధనలు పాటించి పోలీసులకు సహకరించాలన్నారు. గుంటూరు నుండి తెనాలి వైపు వెళ్ళు వాహనాలు బుడంపాడు అండర్‌పాస్ నుండి తక్కెళ్ళపాడు-నందివెలుగు మీదుగా వెళ్లాలని, తిరిగి అదేదారిలో గుంటూరు రావాలని సూచించారు. గుంటూరు నుండి పొన్నూరు వైపు వెళ్ళు వాహనాలు బుడంపాడు అండర్‌పాస్ నుండి ఏటుకూరు బైపాస్ ప్రత్తిపాడు- పెదనందిపాడు-కాకుమాను మీదుగా పొన్నూరు వెళ్లాలని, మళ్ళీ తిరిగి అదేదారిలో రావాలన్నారు. గుంటూరు నుండి క్వారీ తిరునాళ్ళకు వెళ్ళే వాహనాలు నారాకోడూరు మినీబైపాస్ మీదుగా తిరునాళ్ళ వద్దకు చేరుకోవాలని, తిరిగి వెళ్ళు వాహనాలు వేజెండ్ల అడ్డరోడ్డుకు ఎదురుగా ఉన్న రోడ్డు నుండి చేబ్రోలు చేరుకుని రెడ్డిపాలెం-లేమల్లెపాడు - ఏటుకూరు మీదుగా గుంటూరు చేరుకోవాలని సూచించారు. ఈ ఆంక్షలు ఈ నెల 26న మధ్యాహ్నం నుంచి 27 ఉదయం 8 గంటల వరకు అమలులో ఉంటాయన్నారు. తెనాలి నుంచి తిరునాళ్ళకు వచ్చే వాహనాలు వడ్లమూడి అడ్డరోడ్డు, వడ్లమూడి గ్రామం నుండి తిరునాళ్ళకు చేరుకోవాలన్నారు. తిరిగి తెనాలి వెళ్ళే వాహనాలు తెనాలి ప్రధానరహదారిలో వెళ్ళాలన్నారు. పొన్నూరు నుంచి తిరునాళ్ళకు వచ్చే వాహనాలు చేబ్రోలు నుండి వడ్లమూడి వెళ్ళేమార్గం ద్వారా తిరునాళ్ళకు చేరుకోవాలని, తిరిగి అదే దారిలో వెళ్ళిపోవాలన్నారు. భక్తులు పోలీసుల సూచనలు పాటించి ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా సహకరించాలని కోరారు.





లిబియా దేశ ప్రతినిధి మహమ్మద్‌ను సత్కరిస్తున్న వర్సిటీ వీసీ కే గంగాధర్‌రావు

## వర్సిటీని సందర్శించిన లిబియా దేశ ప్రతినిధి

పెదకాకాని, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయాన్ని లిబియా దేశ ప్రతినిధి సోమవారం సందర్శించారు. లిబియా ఎంబసీ నుంచి అకాడమిక్ అటాచిగా విధులు నిర్వహిస్తున్న మహమ్మద్ ఎజ్వలి ఈ పర్యటనలో ఉన్నారు. విశ్వవిద్యాలయంలో లిబియా విద్యార్థులకు బోధన, పరిశోధన అంశాలు, విద్యావిషయాల వివరాలు తెలుసుకునేందుకు ఆయన పర్యటన సాగింది. వర్సిటీలో ఉన్న లిబియా విద్యార్థులు ఈ కార్యక్రమంలో పా ల్గొన్నారు. ఈ సందర్భంగా విశ్వవిద్యాలయంతో ఎంవోయూ కుదుర్చుకునేందుకు ఇన్‌చార్జి వీసీ గంగాధరరావు, ఇన్‌చార్జి రెక్టార్ కే రత్నషీలామణిలను మర్యాద పూర్వకంగా కలిసి వివిధ విషయాలపై చర్చించారు. ఇంటర్నేషనల్ స్టూడెంట్స్ సెల్ ఇన్‌చార్జి డైరెక్టర్ పి.పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

## వర్సిటీ క్రీడాకారిణికి గోల్డ్ మెడల్



గాయత్రిని అభినందిస్తున్న వర్సిటీ వీసీ కే గంగాధరరావు

పెదకాకాని, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం క్రీడాకారిణి 38వ జాతీయ మహిళా క్రీడా పోటీల్లో గోల్డ్ మెడల్ సాధించింది. గత నెల 28 నుంచి ఈనెల 14 వరకు ఉత్తరాఖండ్‌లో జరిగిన 38వ జాతీయ మహిళల క్రీడల్లో వెలగపూడి రామకృష్ణ స్మారక కళాశాల విద్యార్థిని నాగిడి గాయత్రి అద్వితీయ ప్రతిభ కనబరిచి గోల్డ్ మెడల్ సాధించినట్లు డైరెక్టర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ ప్రొఫెసర్ పాల్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు సోమవారం గాయత్రితో వీసీ గంగాధర్‌రావును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వీసీ గాయత్రిని అభినందించారు. ఎస్‌వీఆర్ఎం కళాశాల(నగరం) వ్యాయామ అధ్యాపకులు వి.సాంబమూర్తి, వర్సిటీ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## మార్కెటింగ్ రంగంలో కీలకంగా కృత్రిమ మేథ

విట్ విశ్వవిద్యాలయం అధ్యాపకులు సుహేల్ అహ్మద్ భట్

పెదకాకాని, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): ప్రపంచీకరణకు అనువుగా మార్కెటింగ్ రంగంలో కృత్రిమమేథ కీలకంగా మారే అవకాశాలున్నాయని విట్ విశ్వవిద్యాలయం అధ్యాపకులు సుహేల్ అహ్మద్ భట్ అన్నారు. విశ్వవిద్యాలయంలోని వాణిజ్య విభాగం ఆధ్వర్యంలో సోమవారం మార్కెటింగ్ రంగంలో కృత్రిమమేథ పాత్ర అనే అంశంపై అతిథి ఉపన్యాస కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా సుహేల్ మాట్లాడుతూ ఈ ఏడాది చివరికి దాదాపు 20 మిలియన్ల కొత్త ఉద్యోగావకాశాలు ఏఐ వినియోగం ద్వారా సాధ్యపడుతుందన్నారు. డిజిటల్, టెక్నికల్, కోర్ మార్కెటింగ్ స్కిల్స్ నేర్చుకోవాల్సిన ఆవశ్యకతను వివరించారు. కార్యక్రమానికి విభాగాధిపతి ఆర్ శివరాంప్రసాద్ అధ్యక్షత వహించారు. విభాగం అధ్యాపకులు, పరిశోధకులు పాల్గొన్నారు.

## 'రూరల్ టూరిజం ఇన్ ఇండియా'పై జాతీయ వర్క్‌షాపు

పెదకాకాని, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని టూరిజం అండ్ హాస్పిటాలిటి మేనేజ్మెంట్ విభాగం యూజీసీ సహకారంతో సోషల్, ఎకనమిక్ ఇంపాక్ట్స్ ఆఫ్ రెస్పాన్సిబుల్ రూరల్ టూరిజం ఇన్ ఇండియా అనే అంశంపై రెండురోజుల జాతీయవర్క్‌షాపు సోమవారం డైక్‌మెన్ ఆడిటోరియంలో ప్రారంభమైంది. సదస్సుకు వర్సిటీ ఆర్ట్స్ కామర్స్ అండ్ లా కళాశాల ప్రిన్సిపాల్ సురేష్‌కుమార్ అధ్యక్షత వహించారు. సదస్సులో ఆయన మాట్లాడుతూ సమాజం సామాజికంగా ఆర్థికంగా అభివృద్ధి చెందాలంటే రూరల్ టూరిజంను అభివృద్ధి చేయవలసిన ఆవశ్యకత ఉందన్నారు. తమిళనాడు సెంట్రల్ వర్సిటీ నుంచి ప్రొఫెసర్ అంకతి రఘు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలు ఆర్థికంగా అభివృద్ధి చెందడానికి రూరల్ టూరిజం ఎంతగానో సహకరిస్తుందన్నారు. నాగార్జున విశ్వవిద్యాలయ కామర్స్ అండ్ మేనేజ్మెంట్ స్టడీస్ డీన్ శివరాంప్రసాద్ మాట్లాడుతూ ఆర్థికప్రగతికి రథచక్రాలు పల్లెటూర్లని చెప్పారు. వివిధ టెక్నికల్ సెషన్స్‌లో మొదటగా విశాఖ ట్రావెల్ అండ్ టూరిజం ఫౌండేషన్, ఫౌండర్ అండ్ ప్రెసిడెంట్ డాక్టర్ రేగిడి మణిభూషణ్ ప్రత్యేకఅతిథిగా ఫౌండేషన్ పర్యాటక కార్యక్రమాలను పీపీటీ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఇండియన్ ఇన్ఫర్మేషన్ సర్వీస్, ఆంధ్రప్రదేశ్ దూరదర్శన్ విభాగ అధిపతి (విజయవాడ) జీ కొండలరావు మాట్లాడుతూ గ్రామీణపర్యాటకం గురించి సామాజికమాధ్యమాల్లో సమాచారాన్ని విరివిగా చేరవేస్తూ గ్రామీణ పర్యాటకం ద్వారా అభివృద్ధి సాధించవచ్చన్నారు. ఆక్స్‌ఫర్డ్ కాలేజ్ ఆఫ్ హోటల్ మేనేజ్మెంట్ బెంగళూరు, ప్రిన్సిపాల్ ఎం దేవేంద్ర మాట్లాడుతూ దేశంలో గ్రామీణపర్యాటకం ద్వారా స్థిరమైన అభివృద్ధికి కావలసిన లక్ష్యాల గురించి వివరించారు. తె లంగాణ గవర్నమెంట్ టూరిజం శాఖ మేనేజర్ బ్రహ్మానందరెడ్డి మా ట్లాడుతూ జియోటాగ్ ద్వారా ఆం ధ్రప్రదేశ్‌లో గ్రామీణ ప్రాంతంలో పండుగలను నిర్వహించడం రూరల్ టూరిజంలో భాగంగా చేసుకొని గ్రామీణ పర్యాటకాన్ని అభివృద్ధిచేయవచ్చన్నారు.

### కనులపండువగా స్వామి గ్రామోత్సవం

తెనాలి రూరల్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): సంగం జాగర్లమూడి శ్రీబాలాత్రిపురసుందరీ సమేత శ్రీసంగమేశ్వర స్వామి శేష వాహనంపై గ్రామోత్సవంగా భక్తులకు దర్శనమిచ్చారు. మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా సోమవారం స్వామిగ్రామోత్సవం కనులపండువగా నిర్వహించారు. పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొని స్వామిని దర్శించుకున్నారు.

**బహిరంగ ప్రకటన**

మా క్లయింట్ శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, మాచర్ల బ్రాంచ్ వారి సూచనలు పొంది యుండుటవలనుగా యావన్మందికి తెలియచేయునది ఏమనగా... అమూల్య చిన్న వెంకటేశ్వర్లు గారి కుమారుడు అమూల్య నాగ ప్రసాద్ గారి ఆస్తి తనఖా పెట్టుకొని ఋణము పొందుటకు సంప్రదించినారు. కావున ఈ దిగువ షెడ్యూలు ఆస్తికి సంబంధించి ఎవరికైనా అభ్యంతరములు, ఋణములు ఉన్నచో 7 రోజులలోపు తెలియచేయవలయును. ఎట్టి అభ్యంతరములు, ఋణములు రానిచో మా క్లయింట్ సదరు అమూల్య నాగ ప్రసాద్ గారికి ఋణం మంజూరు చేయును. షెడ్యూలు : పల్నాడు జిల్లా, నరసారావుపేట రిజిస్ట్రేషన్ జిల్లా, గురజాల సబ్ రిజిస్ట్రారు వారి ఋలకా గురజాల మండలంలోని మాదుగుల గ్రామ పంచాయితీ ఏరియాలో చేసిన మాదుగుల గ్రామంలో 4-54 డోరు నెంబరు సమీపంలో వాకు హక్కు కలిగి యా రోజున నేను నీకు విక్రయించి స్వాధీనపరచిన 290.4 చదరపు గజముల ఖాళీ స్థలమునకు హద్దులు తూర్పు : మొగిలి వెంకటేశ్వర్లు వైనాల ఆస్తి హద్దు, దక్షిణం : రోడ్డు, పడమర : శేరెడ్డి సైదయ్య గారి ఆస్తి హద్దు, ఉత్తరం : పాపబోయిన వెంకటరామయ్య గారి ఆస్తి హద్దు, ఈ హద్దుల మధ్య య. 0.06 సెంట్లు అనగా 290.4 చదరపు గజములు అనగా 243.93 చదరపు మీటర్లు గల ఖాళీ స్థలమును నేను నీకు యా రోజునే విక్రయించి ఈ రోజునే నేను స్వాధీనపరచుచున్నది. యా విక్రయ స్థలము మాదుగుల గ్రామ పంచాయితీకు చెందిన మాదుగుల గ్రామ డి.నెం. 1372-3లో స్థలము అయి వున్నది. DOC NO: 19139/2024, S.R.O. గురజాల.

లంకా విజయ్‌కుమార్, లంకా వంశీకృష్ణ, న్యాయవాదులు, 2వ లైను, రవీంద్ర నగర్, గుంటూరు. సెల్ నెం.9030595227, 9848052914

**శ్రీ భావనారాయణ స్వామి మరియు శ్రీ కాశీవిశ్వేశ్వర స్వామి వార్ల దేవస్థానము**
పొన్నూరు, గుంటూరు జిల్లా.

ఆర్.సి.నెం: 05/2025 తేది : 25.02.2025

**సీల్డు టెండరు ప్రకటన**

పై దేవాలయమునకు అవసరమైన కిరాణా సరుకులు వగైరాలను, ది.01-04-2025 నుండి ది.31-03-2026 వరకు అనగా ఒక సంవత్సర కాలమునకు సప్లయి చేయుటకుగాను ప్రభుత్వ రంగ సంస్థలు, హోల్‌సేల్ వర్తకులు, సూపర్ బజార్‌ల నుండి సీల్డు టెండర్లు కోరబడుచున్నవి. సీల్డు టెండర్లు దాఖలు చేయువారు దేవాలయ కార్యాలయం వద్ద ది.11-03-2025 సాయంత్రం గం.4-00 ల లోపు రు.1,000/- లు చెల్లించి టెండరు షెడ్యూలు కొనుగోలు చేసి, దానికి రు.30,000/-లు ధరావత్తు గల డి.డిని జతచేసి ది.12-03-2025 ఉదయం గం.11.00 లోపు టెండరు బాక్సుయందు దాఖలు చేయవలెను. అదే రోజు మధ్యాహ్నం గం.12.00లకు టెండర్లు తెరవబడును. ఇతర షరతులు మరియు వివరములకు దేవస్థాన కార్యాలయములో పనివేళల యందు సంప్రదించగలరు.

సం/- సహాయ కమీషనరు & కార్యనిర్వహణాధికారి,
ఫోన్ నెం. 9491000730